[కథానిక]

# ఉన్నతోద్యోగాలు

—'కరుణకుమార'—

"Success in flying colours. Start immediately —Bindu."

టెలిగ్రాం చదువుకొని—

"అబ్బాయీ!" అని పిలిచాడు, తండ్రి రాజశేఖరరావు.

బాబూరావును చూచి—

"*Congratulations*!" అన్నాడు తండ్రి.

చిరునవ్వు నవ్వుతూ, తండ్రిచేతిలోని టెలిగ్రాం చదువుకొని, "బిందు ఇచ్చాడు—మద్రాసునుంచి. రిజల్ట్సు తెలియడంతోటే టెలిగ్రాం ఇవ్వమని వ్రాశానులెండి." అన్నాడు బాబూరావు.

పడకగదిలో నిలువుటద్దం ఎదుట తలపాపిట దిద్దుకొనే రాజేశ్వరి ఈ మాటలు విని బయటికి వచ్చింది.

"అబ్బాయి పాసయినాడట! మద్రాసునుంచి బిందు టెలిగ్రాం యిచ్చాడు" అన్నాడు, రాజశేఖరరావు.

ఆతల్లి ఆనందం నఖశిఖపర్యంతం పొంగి, జడ అల్లుకోను విప్పుకొన్న తలకట్టుమీద నెమలిపింఛంలా విప్పారింది.

"వాడు పాసుకావడాని కేమిటండీ! స్కూలు ఫైనలు పాసుకావడం వాడి కో లెక్కా, జమా! నాతండ్రి ఐ. సి. యస్. పాసవుతాడు మాడండి." అని బాబూరావు నుదుటిమీద ముద్దిడుకొని అక్కున చేర్చుకొంది తల్లి.

"ఆహా! ఏమీ నాభాగ్యము
స్వామి కరుణించెగా నేటికి
నాజన్మ తరియించెగా—"

అని పాట పాడుతూ చేతులు తిప్పుకొంటూ తల్లిదగ్గరకు వచ్చి—

"ఏమిటే అమ్మా?" అని అడిగింది కళ.

"అన్నయ్య పాసయినాడట! టెలిగ్రాం వచ్చింది." అని తల్లి యింకా చెప్పుతూఉండగానే...

"*Success in flying colours* అని వ్రాశాడు బిందు" అన్నాడు తండ్రి.

"అంటే?" అన్నది కళ.

"అంటే మీఅన్నయ్య ఫస్టుగా పాసయినాడన్నమాట. నూటికి నూరు మార్కులు వచ్చాయన్నమాట" అన్నది తల్లి.

"అయితే, నా కేమి తెచ్చిపెట్టుతా వన్నయ్యా!" అంటూ బాబూరావుమీద పడింది కళ.

బాబూరావుకి ఒకవంక ఆనందం, ఇంకోవంక ఏమిటో సంభ్రమం, ఆదుర్దాగా ఉన్నది మనస్సులో.

"నీవూ అన్నయ్యలా చదువుకొని ఐ. సి. యస్. ఫస్టుగా పాసయితే అప్పుడు నీకు ఏది కావాలంటే అది తెచ్చి పెట్టుతాడులేవే!..." అన్నది తల్లి కళతో.

"ఊఁ! నేను పాసయితే అన్నయ్యకి నేనే కొనిపెట్టుతా" నన్నది కళ.

నలుగురూ కిలకిలమని నవ్వుకున్నారు.

"అయితే, వెంటనే బయల్దేరి రమ్మన్నాడెందుకురా అబ్బాయీ?" అని అడిగాడు రాజశేఖరరావు.

"ముందుగా వెళ్లితే కాలేజీలో సీటుకోసరం ప్రయత్నం చేయవచ్చు" అన్నాడు బాబూ.

"అయ్యో! ఇదేమిటిరా బాబూ! శెలవులకు వచ్చి ఇంటిలో నాలుగు పూట లున్నట్టు లేదు! అప్పుడే వెళ్లుతావా పట్నం?" అని దిగులుముఖం పెట్టింది తల్లి.

"కాలేజీలో సీట్లకు ఎంత త్రొక్కిడిగా ఉంటుందో తెలుసా నీకు?" అని అడిగాడు బాబూ.

"ప్రెసిడెన్సీలో ఫస్టుగా పాసయినవాళ్లకు కూడా సీటు దొరకదా ఏమిటి?" అని సగర్వంగా నవ్వింది తల్లి.

"కొడుకుమీద నీకూ నాకూ కడుపు తీపి ఇట్లాగే ఉంటుంది కాని, వాడు చెప్పినట్టు వెళ్లడమే మంచిది. వెళ్లనిద్దూ—" అన్నాడు తండ్రి.

"రేపో ఎల్లుండో తలకు నీళ్లు పోసి—నా తండ్రికి తీపి అంటే ఇష్టం—ఇంత జిలేబీ, పాలకోవా చేయిద్దా మనుకొంటున్నాను. అప్పుడే ప్రయాణమటరా బాబూ!" అని, దొడ్డిలో బావిదగ్గర బియ్యం కడిగే వంటబ్రాహ్మణ్ణి పిలిచింది రాజేశ్వరి.

౨

రాజశేఖరరావు ఆర్వేల నియోగి. కొత్తపట్నంలో తహశీల్దారుగా ఉంటున్నాడు.

కొడుకు స్కూలుఫైనలు పాసయినాడని టెలిగ్రాం వచ్చేవరకు ఆరోజు రాజేశ్వరి ఆనందం చెప్పలేం.

రాజేశ్వరి గొప్పయింటి బిడ్డ. ఆమెతండ్రి దివాన్ బహదూరు కొండలరావుగారు జిల్లాకలెక్టరీ చేసి, గవర్నమెంటులో భళా అనిపించుకొని, రిటైరయి ఇప్పుడు కూచిబీహారుసంస్థానంలో దివాన్‌గా ఉన్నాడు. ఆమెఅన్నగార్లు నలుగురూ పెద్ద చదువులు చదివి, ఒకడు యు. పి. లో సబుకలెక్టరుగానూ, రెండవవాడు బెంగాలులో ఇంజనీయరుగానూ, మూడవవాడు జబ్బల్‌పూరులో మిలిటరీలోనూ, నాలుగవవాడు మద్రాసులో ఇన్‌కంటాక్సు ఇన్‌స్పెక్టరుగానూ ఉద్యోగాలు చేస్తున్నారు. రాజేశ్వరి ఒక్కతే ఆడకూతురు. స్కూలుఫైనలు పాసయింది.

ఆమె గానప్రియ. రాజశేఖరరావు గొప్ప పాటకుడు. అతడు తనవలె గొప్పయింటి బిడ్డ కాకపోయినా, అతని చక్కదనమూ, అతని పాటా, తెలివీ చూచి మోహించి, అతడు విజయనగరం కళాశాలలో బి. ఏ. చదువుతుండిన రోజుల్లో ఆమె అతనిని వరించి వివాహంచేసుకొన్నది. వివాహం అయినతర్వాతనే రాజశేఖరరావు చెన్నపట్నంలో బి. ఎల్. చదివి పాసయాడు. కాని అతడు బల్ల కట్టి ప్రాక్టీసు పెట్టుతానంటే, అడ్వకేటు ఉద్యోగంలో అధికారం లేదని రాజేశ్వరి అంగీకరించక, తండ్రి జిల్లాకలెక్టరీ చేస్తుండిన రోజుల్లో ఆయనసహాయంతో పెనిమిటికి రివిన్యూ డిపార్టుమెంటులో ఇన్‌స్పెక్టరీ ఉద్యోగం ఇప్పించింది.

రాజశేఖరరావు ఉద్యోగంలో చేరిన క్షణం లగాయతు అతడు తనతండ్రివలె జిల్లాకలెక్టరు ఎప్పుడవుతాడా, ఎప్పుడు తన కోరిక ఫలిస్తుందా అని ఆమె తహతహలాడిపోతూవచ్చింది. కాని రాజశేఖరరావు ఉద్యోగంలో చేరి పదిహేను సంవత్సరాలయినా ఇంకా తహశీల్దారుగానే ఉండిపోయాడు. ఈపాటికతడు కనీసం డిప్టీకలెక్టరయినా అయిఉండవలసింది. కాని కాలేదు. ఇదే ఆమెదుఃఖం. ఇదే ఆమె దిగులు.

ఆ దంపతులకు బాబూరావు ఒక్కడే కొడుకు. చంద్రకళ ఒక్కతే కూతురు. తండ్రి ఉద్యోగపు టూళ్లు మారుతూంటే కొడుక్కు చదువు అబ్బదని బాబూరావుని చెన్నపట్నంలో చదువునిమిత్తం మేనమామవద్ద విడిపించింది తల్లి.

తన బొందెలో జీవం ఉండగా పెనిమిటి రాజశేఖరరావుకు జిల్లా కలెక్టరయే యోగం ఉన్నదో, లేదో కొడుకు బాబూరావయినా ఎక్కి వచ్చి, కలెక్టరయి తాతగారి పేరు నిలబెట్టాలని ఆమె తపస్సు చేస్తోంది. కాని అతడింకా పదహారేండ్ల బాలుడు.

ఒకవిధంగా ఆమె అసంతృప్తికరమైన జీవితం గడిపే రోజులలోనే, ఇప్పుడు బాబూరావు స్కూలు ఫైనలు పాసయినాడని టెలిగ్రాం వచ్చేవరకు ఆరోజు రాజేశ్వరికి పర్వదినం అయిపోయింది. అందులో తన కొడుకుది సామాన్యపు ప్యాసు కాదు. ***Success in Flying Colours*** అని టెలిగ్రాం కొట్టాడు—బిందు. ఎన్నివందల మార్కులు కురిసిపోయాయో—బాబూకి?

ఆరాత్రి మెయిలుకు అబ్బాయి సెక్కించివస్తానని ప్రయాణం స్థిరపరిచాడు రాజేశ్వరరావు.

చాకలివాడికి కబురుచేసి అబ్బాయి గుడ్డలు తెప్పించింది తల్లి. అతని పెట్టె సర్దివేసింది. వంటమనిషి వీరయ్యతో చెప్పి పిండివంటలు చేయించింది.

"నీ అమ్మకడుపు చల్లగా నీ తల్లికడుపు చల్లగా, బాగా చదువుకొని ఐ. సి. యస్. పాసయి కలెక్టరీ చేసి......" అని అతనిని దీవించి తలమీద చమురు పెట్టి నీళ్లు పోసింది.

కొడుకు పాసయినాడంటే రాజశేఖరరావుకూ సంతోషంగానే ఉన్నది. కాని తర్వాత జరగవలసిన దేమిటి?

కాలేజీలో చేరుతాడు. బి. ఏ. పాసవుతాడు. ఆతర్వాత?

అతగాడికి ఆలోచన పాలుపోలేదు.

తండ్రిఅయిన తన జీవితం ఏమయినట్టు? తాను బి. ఎల్. ఎందుకు చదివినట్టు! సర్కారు నౌకరీలో దేనికి చేరినట్టు?

"ఇంటరులో ఏ సబ్జెక్టు తీసుకోమంటారు నాన్నగారూ?" అంటూ దగ్గరకు వచ్చాడు బాబూరావు.

అన్నట్టు, ఇదికూడా ఒక సమస్యే! ఇప్పుడు ఏరుకొనే సబ్జెక్టుమీదనే ఆధారపడిఉంటుంది—పిల్లవాడి భావిజీవితం.

"అసలు నీకు ఏ డిపార్టుమెంటులో ఉద్యోగం చేయాలని ఉంది చెప్పూ? ఇంజనీయరుగానా, డాక్టరుగానా, కాలేజీ ప్రొఫెసరుగానా, వ్యవసాయ డిపార్టుమెంటులోనా, ప్లీడరుగానా, కలెక్టరుగానా........"

తండ్రిని తానొక ప్రశ్న అడిగితే, దానికి సమాధానం చెప్పకుండా ఇంకో ప్రశ్న అడుగుతున్నాడు తండ్రి కొడుకుని. అసలు సర్కారులో ఇన్ని రకాల డిపార్టుమెంటులూ, ఉద్యోగాలూ ఉన్నాయని ఆపసికందు కేమి తెలుసు?

"అబ్బాయి కలెక్టరీ చేయాలండీ. మీ రేమన్నా సరే, వాడికి ఎమ్. ఏ. దాకా చదువుచెప్పించండి మీరు, ఆతర్వాత కలెక్టరుగా చేసే పూచీ నాది." అని లోపలనుండే సమాధానం యిచ్చింది రాజేశ్వరి.

ఆరాత్రి మెయిల్లో బాబూరావు నెక్కించి యింటికి వచ్చాడు రాజశేఖరరావు.

## 3

కొత్తపట్నంలో రాజశేఖరరావు కాపురం ఉండే వీథిలో ఇంకా చాలామంది ఉద్యోగస్థులు కాపురా లున్నారు. ఇతరప్లీడర్లు, డిస్ట్రిక్టు మునసబూ అవతల తూర్పువీథిలో కాపురం. రాజశేఖరరావు కెదురుగ్గానే ఉన్నది అడ్వకేటు మధుసూదనరావు కాపురం ఉండే యిల్లు.

మధుసూదనరావుకూడా ఆర్వేల నియోగే. అతని తండ్రి రామభద్రేశ్వరరావు డి.పి.డబ్ల్యు. లో అసిస్టెంటు ఇంజనీయరుగా పనిచేసి రిటైరయి యింటిదగ్గరనే ఉంటున్నాడు. ఆయనగారికి మధుసూదనరావు ఒక్కడే కొడుకు. అతని తర్వాత ఇద్దరాడపిల్లలు కలిగారు గాని రెండేసి ఏళ్లు పెరిగి అక్కరకు రాకుండా పోయారు. ఆ తర్వాత లేకలేక ఒక ఆడపిల్లకలిగితే ఆ పిల్లని పుల్లాకుల్లో దొర్లించి బారసాలా బండలూ లేకుండా పిచ్చమ్మ అని పిలుచుకొంటూ ఉండేవారు రామభద్రేశ్వరరావూ, ఆయనభార్య గంగమ్మగారూను.

పిచ్చమ్మ అంటే గంగమ్మకు పంచప్రాణాలూను. ఆతల్లికి పిచ్చమ్మ అంటే ఉన్నంతప్రేమ మధుసూదనరావు అంటే లేదేమో అనిపిస్తుంది. పిచ్చమ్మకి అయిదారేళ్లు పెళ్లి బాలారిష్టదోషాలు గడిచి బయటపడేసరికి, పిచ్చమ్మ పిచ్చమ్మ అని పిలుచుకోడానికి ఆతల్లికి ఇదనిపించి పిచ్చమ్మ అనే పేరుకు కళ అని ఒక నాజూకుపదం చేర్చి, పిచ్చికళా, పిచ్చికళా అని పిలవడం ఆరంభించేసింది. అప్పటినుండీ, ఇంటా బయటా కూడా ఆ అమ్మాయిని పిచ్చికళా అని పిలుస్తూవస్తున్నారు.

మధుసూదనరావు అడ్వకేటుబోర్డు కట్టిన మరుక్షణమే కాంగ్రెస్సులో చేరిపోయాడు. తండ్రి రామభద్రేశ్వరరావు అసిస్టెంటు ఇంజనీయరుగా ఉండగా అమితంగా సంపాదించాడని అంటారుగాని, రిటైరయ్యేసరికి ఆయనచేతిలో ఎఱ్ఱని ఏగానీ మిగల్లేదు.

మధుసూదనరావు ఏకైకపుత్రుడు గాబట్టి అతనిమీదనే తమ ఆశాలతలు పెట్టుకొని ఆ తల్లిదండ్రులు బ్రదుకుతున్నారంటే దానిలో విడ్డూర మేమీ ఉండదు. పుట్టినది లగాయతు అతగాడికి, కనపడిన జ్యోతిషపండితుని చేతనల్లా జాతకాలు వ్రాయిస్తూ ఉండేవాడు తండ్రి.

ఒకసారి ఒక జ్యోతిష్కుడు అతని జాతకం ఆమూలాగ్రం పరిశీలించి చెప్పడంలో, మధుసూదనరావు మేజరయి సంపాదనకి అందుకొన్న తర్వాత అతని ఇంట నూరు, అయిదు:oదలు, వెయ్యిరూపాయల నోట్ల కట్టలు, దస్త్రాలు దస్త్రాలుగా పడిఉంటాయనీ, ఇల్లూ వాకిలీ నోట్లని కాళ్లా వేళ్లా దున్నిపారేస్తారనీ, పిల్లకాయలు కాగితంతో బొమ్మలు కత్తిరించుకోవాలంటే కరెన్సీనోట్లే తీసి కత్తిరించుకొంటారనీ, చివరకి, కుంపటిలో బొగ్గు లంటించుకోను వంటబ్రాహ్మణుడు నూరురూపాయలనోట్లు ముట్టించి నిప్పుచేస్తాడనీ—మనం వినలేము, నమ్మలేము—ఆ ప్రకారం జాతకఫలితం చెప్పాడట !

"అంత గొప్పగా డబ్బు సంపాదించడానికి నా కొడుకు ఏ వుద్యోగం చేస్తాడండీ స్వామీ" అని పండితుని క్రాసుచేసిం దట తల్లి.

పండితుడు వేళ్లు లెక్క పెట్టాడట !

"హైకోర్టుజడ్జీగానా, కలెక్టరుగానా, గవర్నరుగానా—ఏ వుద్యోగం చేస్తాడో చెప్పదురూ దయ ఉంచి" అని ఆమె అడుగుతూంటే—

"ఛా ! ఈ వుద్యోగాల్లో నెలజీతాలే గాని కాళ్లా, వేళ్లా దున్నిపారేసే సంపాదనకి అవకాశం ఎక్కడిదీ?" అని చీదరించుకొన్నాడట తండ్రి రామభద్రేశ్వరరావు.

ఆనాడు పండితునికి ఇంట్లో విందు చేసి, తాంబూలంలో ఒక బంగారు మొహిరీ సంభావనపెట్టి సత్కరించిందట గంగమ్మ.

## ౪

గంగమ్మకు మధుసూదనరావూ, పిచ్చికళా రెండు కళ్లు. కొడుకు వివాహంఅయి, ప్రాక్టీసు లేకపోయినా బిడ్డలతండ్రి అయిపోయాడు.

పిచ్చికళ ఏడుమల్లెపూలఎత్తు మనిషి. ఆమెకు పెద్దచదువు చెప్పించాలని తల్లి తపస్సు చేసిందిగాని, ఆమె మూడోఫారం ప్యాసయ్యేసరికి ముత్తాతలు దిగి వచ్చారు. ఆమెకు ఊళ్లోనే పెళ్లిచేసి అల్లుణ్ణి యిల్లరికం పెట్టుకుంది తల్లి.

మధుసూదనరావు కాంగ్రెస్సులో చేరి కొంత పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్నాడు. ౧౯౪౨లో యుద్ధప్రతికూలప్రచారం చేసి మూడు నెలలు రాజమండ్రి సెంట్రల్ జెయిల్లో శిక్ష అనుభవించివచ్చాడు. ఈ త్యాగఫలితంగా కాంగ్రెస్సుప్రభుత్వం ఏర్పడినప్పుడు అతగాడికి గొప్ప పదవి లభించి, జ్యోతిష పండితుడు చెప్పిన సంపాదన అందుకోవాలని ఇంటిల్లిపాదీ ఘోరతపస్సు చేస్తున్నారు.

ఎదుటింటి రాజేశ్వరికి కాంగ్రెసన్నా, గాంధీగారన్నా, సత్యాగ్రహమన్నా వొంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకినట్టుంటుంది. ఆమెకు కావలసినది తన పెనిమిటికి కలెక్టరు ఉద్యోగం. ఇదే ఆమె ఆరాటం, ఇదే ఆమెగానం, ఇదే ఆమెతపస్సు.

గంగమ్మకు రాజేశ్వరి అన్నా, రాజశేఖరరావు అన్నా ఈసడింపు. బి. ఎల్. పాసయికూడా రాజశేఖరరావు సర్కారునౌకరీలో చేరి బ్రదుకుతున్నాడని తిరస్కారభావం. తన కొడుకు కాంగ్రెసునాయకుడై రేపు ప్రభుత్వమే తన చేత పెట్టుకోబోతున్నాడని ఆమెగర్వం.

ఒకరోజు ఉదయం పదిగంటలప్పుడు గంగమ్మా, ఆమెపెనిమిటీ, మధుసూదనరావూ, పిచ్చికళా హాలులో కూర్చుని కాంగ్రెస్సురాజకీయాలూ, మంత్రిపదవులూ, ఉద్యోగాలూనుగురించి మాట్లాడుకొంటుండగా, ఒకమనిషి నెత్తిన పాగా, నల్లని గడ్డం, కనిబొమల్లో ఎర్రని కుంకుమబొట్టూ, లాంగుకోటూ, కోటుమీద బంగారు మెడల్సూ, కంటికి అద్దాలూ, చేతిలో పుస్తకాలూ పట్టుకొని, వాకిటిముందు నిలబడి,

"మాస్టర్, మాస్టర్ !" అని పిలిచాడు.

"ఎవరు మీరు?..."అని పలకరించింది గంగమ్మ.

"మాది ఉత్తరహిందూస్థానం. మీకు జాతకఫలితం చెప్పడానికి వచ్చాను. మీ అబ్బాయి చాలా దొడ్డవాడు. ఆయనకు కళ్లల్లో ఉన్నది సిరి. అదిగో కుర్చీలో కూర్చున్నాడన్నమాటేగాని, ఆయనమనస్సు మనస్సులో లేదు. శాంతి లేదు. ఇంక కొద్దికాలమే గడువు. గొప్ప దశ అందుకుంటుంది..." అని అడగకుండానే పాఠం అప్పచెప్పడం ఆరంభించేశాడు.

ఆ మనిషిని లోపలికి పిలిచి కుర్చీ చూపించింది గంగమ్మ. తన కొడుకునుగురించిన మహదైశ్వర్యవృత్తాంతం ఆ మనిషి చెప్పుతుండగా వినవలెనని గంగమ్మ ఒక్కపరుగుపెట్టి రాజేశ్వరినికూడా పిలుచుకొనివచ్చింది.

శరీరమంతా చెవులు చేసుకొని వింటున్నారు—రామభద్రేశ్వరరావూ, గంగమ్మా, మధుసూదనరావూ, పిచ్చికళాను.

"మాస్టర్ ! నీది గొప్ప దశ. నీకష్టాలన్నీ గడిచిపోయినై. నీజీవితంలో నీతల్లిదండ్రులు ఆశించిన ఆశలు ఫలించే రోజులు ఇప్పుడు వచ్చినై. నీ చేతిలో రాజలాంఛనమైన ముద్రాధికారం ఉన్నది. నీకు రాజ్యపరిపాలన చేసే యోగం ఉన్నది. నీవు సంపాదించే సంపాదనకు మేర ఉండదు. ప్రజలు నీనాయకత్వం క్రింద నీఅడుగుజాడల్లో తిరుగుతుంటారు......"

గంగమ్మకు నడుములు జారిపోతున్నవి. రామభద్రేశ్వరరావు చేతిగుడ్డతో కళ్లు తుడుచుకొన్నాడు. మధుసూదనరావు ముసిముసినవ్వులు నవ్వుతున్నాడు. పిచ్చికళకి పిచ్చెత్తినట్టయింది.

"ఇంకా ఎన్నాళ్లు నాయనా, మా కీ కష్టకాలం?......" అని అడిగింది గంగమ్మ.

"ఇంక కష్టమన్నమాటే చెవిని పడగూడదు. అంతా సుఖమే. అంతా ఆనందమే. ఒకటీ, రెండూ, మూడూ—అంతా రోజులమీదనే ఉన్నది ఆయనగారి మహర్దశ. మీ ప్రయత్నం లేకుండానే ఇంటికి నడచివస్తోంది ఆయనఐశ్వర్యం. మీరు వద్దన్నను ఆయన్ను లాక్కొనివెళ్లి సింహాసనంమీద కూర్చోబెట్టుతుంది దశ".

గంగమ్మకు చెమ్మటలు పోస్తున్నవి.

"ఈ పిల్ల చెయ్యి ఒక్కసారి చూడండి నాయనా..." అని పిచ్చికళని చూపెట్టింది.

పిచ్చికళ చేతిలో ఒక కాగితం పెట్టాడు జ్యోతిష్కుడు. కన్నులు మూసి ఏదో చదువుకొన్నాడు. ఒక ముక్కు చేత్తో మూసి రెండో ముక్కుద్వారా శ్వాస విడిచాడు. 'జాయ్ సద్గురూ' అన్నాడు.

"ఈ అమ్మాయిజీవితంలో రాణి అయ్యే యోగం ఉన్నది. ఈమెకు కొద్దికాలంలో మగపిల్లవాడు కలుగుతాడు. ఈలోపలనే ఈఅమ్మాయికి గవర్నమెంటులో నెలకి అయిదు వేల రూపాయల ఉద్యోగం అవుతుంది. ఈమె స్త్రీజాతికి నాయకత్వం వహించి, పురుషులతోబాటు స్త్రీలకు సమానహక్కులు సంపాదించడానికి తన జీవితం ధారపోసి తొందరలోనే కృతకృత్యురాలవుతుంది. ఇది సత్యం, సత్యం, సత్యం......నిజం చెప్పాస్తే, అబ్బాయిగారి జాతకంకంటే కూడా ఈమెజాతకమే గొప్పజాతకం !"— అన్నాడు దాడీవాలా !

గంగమ్మగారు తన చెవులను తనే నమ్మలేకపోతున్నది.

"కొండంతవారికి కొండంత పూజ చేయలేం. కాని ఇది తీసుకొని ఇదే పదివేలు అనుకోండి." అని ఆయనచేతిలో ఒక పదిరూపాయల కాగితం పెట్టింది గంగమ్మ.

"హరేరాం, హరేరాం, రాం, రాం" అని తీసుకొని కళ్ల కద్దుకొని నమస్కారం పెట్టి వెళ్లిపోయాడు జ్యోతిష్కుడు.

పదకొండుగంటలయినా ఒకళ్లకీ ఆకళ్లు లేవు. రాజేశ్వరి గంగమ్మప్రక్కన కూర్చుని అంతా చూస్తూనే ఉన్నది.

"ఇద్దరు పిల్లలకీకూడా రాజయోగం ఉన్నదన్నాడు మరి"అన్నది గంగమ్మ.

"................"

"ముద్రాధికారం ఉన్నదన్నాడు—అంటే ఏమిటిరా అబ్బాయీ ?..."అని అడిగింది గంగమ్మ.

"గవర్నమెంటులో గొప్ప అధికార్లకి రాజలాంఛనంగా వెండిముద్రలూ, బంగారుముద్రలూ ఉంటాయి. సర్కారులో ఏ ఉత్తర్వులు పుట్టినా, ఆ కాగితంమీద ముద్ర కొట్టి మరీ పంపుతారు. అటువంటి అధికారలాంఛనమైన ముద్ర అబ్బాయిచేతిమీదుగా జారీఅవుతుం దన్నమాట"అని విస్తరించాడు రామభద్రేశ్వరరావు.

"పిచ్చితల్లి స్కూలు ఫైనలయినా పాసుకాలేదే, దీనికి నెలకి అయిదు వేల రూపాయల ఉద్యోగం ఎట్లా అవుతుందండీ"అని అడిగింది గంగమ్మ.

"ఇవి ప్రజాప్రభుత్వపు రోజులు. ప్రజాప్రభుత్వంలో పరిపాలనచేయడానికి అక్షరమ్ముక్క రావలసిన అవసరం లేదు. డిగ్రీలు అంతకంటెనూ అవసరం లేదు." అన్నాడు ముసలాయన.

అంగీకరించినట్టుగా మధుసూదనరావు మౌనం వహించాడు. "పిచ్చికళకే నెలకి అయిదు వేల రూపాయల ఉద్యోగమైతే అబ్బాయి కెన్ని వేల రూపాయల ఉద్యోగం అవుతుందండీ?" అన్నది గంగమ్మ.

"మళ్లా మొదటికి వస్తావేమిటి ? ప్రజాప్రభుత్వంలో సర్కారు డబ్బంతా ఆర్థికశాఖామంత్రి చేతిలో ఉంటుంది : డబ్బుమీది అధికారం అంతా ఆయనదే !..." అన్నాడు రామభద్రేశ్వరరావు.

"అంటే, అబ్బాయి ఆర్థికశాఖామంత్రి అయితే సర్కారుడబ్బంతా వాడి ఇష్టప్రకారం ఖర్చుపెట్టుకోవచ్చు నన్నమాటే!"

"ఆర్థికమంత్రే అవుతాడో, ప్రధానమంత్రే అవుతాడో, గవర్నరే అవుతాడో ఎవరు చెప్పగలరు ? మొత్తానికి జ్యోతిష్కులు చెప్పినట్టు వాడు డబ్బు కాళ్లా వేళ్లా దున్నిపారేస్తాడు."

"నిజమే?"

"అసలు నా ఉద్దేశ్యమేమిటంటే: అబ్బాయి గాని, కళగాని మద్రాసురాష్ట్రరాజకీయాల్లో ప్రవేశించడం నా కిష్టం లేదు."

"ఏమి?"

"వాండ్లు ఇండియాగవర్నమెంటులో నెహ్రూగారికీ, పటేలుకూ మద్దత్తుగా ఉండి జాతీయప్రభుత్వపు ప్రణాళికలు తయారుచేయవలసినవాండ్లు."

మధుసూదనరావుకూ, పిచ్చికళకూ చెవుల్లో అమృతవర్షం కురుస్తోంది.

"రేపో ఎల్లుండో నెహ్రూదగ్గరనుండి అబ్బాయికి టెలిగ్రాం వస్తుంది, చూడు—నిలుచున్నపాటుగా బయల్దేరి రమ్మని."

"అట్లయితే సంసారం ఢిల్లీకి మార్చవలసిందే?"

"ఢిల్లీ అంటే దూర మనుకొన్నావు గాబోలు. అవి పాతకాలపు రోజులు. ఇప్పుడో?—మద్రాసులో ఉదయం భోజనం చేసి విమానం ఎక్కితే మధ్యాహ్నం టీ ఢిల్లీలోనే!"

"ఆహా! ఎంత పుణ్యమమ్మా! అయితే నా పిచ్చితల్లి కళగూడా ఢిల్లీ వెళ్లిపోతుం దండీ?"

"ఇదిగో! ఇదే మన ఆంధ్రులలో ఉండే అజ్ఞానం. పిచ్చితల్లి, పిచ్చితల్లి అని ఏమి టీ మమకారం? నెత్తిమీదికి పాతికేళ్లు వచ్చి భారతమహిళాసంఘానికి నాయకత్వం వహించి, రాజ్యాంగచక్రాన్ని చేతిలో పెట్టుకోవలసిన మనిషి—నీదృష్టిలో ఇంకా పాలు త్రాగే పసిపిల్లలా కనిపిస్తోంది కాబోలు!"

"నాపిచ్చితల్లికి ఏ బి. ఏ. దాకానయినా చెప్పించాను కాను చదువు.—"అని కూర్చున్న గంగమ్మ లేచి పిచ్చికళదగ్గరికి వెళ్లి చెంపలమీద నిమిరి వేళ్లు విరుచుకొంది.

"చదువుకోలేదు, చదువుకోలేదు అని ఊరికే విచారపడుతావు, ఆంధ్రులలో ఏఆడది చదువుకొన్నదో చెప్పుదూ!" అన్నాడు రామభద్రేశ్వరరావు.

"ఆంధ్రదేశంలోనే కాదు—యావద్భారత దేశంలోకూడా...సరోజినీనాయుడు, విజయలక్ష్మి పండిట్ లాంటి ఏఒకరిద్దరో తప్ప చదువుకొన్న ఆడదే లేదు." అన్నాడు మధుసూదనరావు.

"విన్నావా? ఆడదానికి కావలసినది మొగవాడితో సమానంగా ఢీకొని, ప్రజలకు సంబంధించిన ఉద్యమాలు నడిపే ధైర్యమూ, తెలివీ కావాలిగాని—పనికిమాలిన డిగ్రీలు—బి.ఏ. ఎమ్.ఏ. లు ఎందుకూ?..." అన్నాడు తండ్రి.

"అయితే, అమ్మాయీ, నీవు ఢిల్లీకి వెళ్లితే ఏశాఖకు మంత్రిగా ఉంటావే?..." అని అడిగింది తల్లి.

పిచ్చికళ పిచ్చిగా నవ్వి—

"ఏమంత్రిపదవిఅయినా సరే! భారతనారీమణిని ఉద్ధరించడమే నా ఆదర్శం..." అన్నది కళ.

"ఏమో! నెహ్రూగారు అమ్మాయిని ఇండియాలోనే ఉంచుతాడో, లేక ఏ అమెరికాకయినా రాయబారిగా పంపుతా నంటాడో?" అన్నాడు తండ్రి.

"అమ్మయ్యో!..." అని గుండెలు బాదుకొంది తల్లి.

"అమెరికాకు వెళ్లితే ఒక్కతే వెళ్లుతుం దనుకొన్నావా? కూడా ప్రయివేటుశెక్రటరీలు, గుమాస్తాలు, నౌకర్లు, చాకర్లు—ఎంతోమంది సిబ్బంది. ఏమిభయం? నీ కంత భయంగా ఉంటే అమ్మాయితో కూడా నే వెళ్లుతాలే..." అన్నాడు తండ్రి.

"వా రింటికి వచ్చే వేళ అయిం"దంటూ రాజేశ్వరి లేచి చక్కా వెళ్లిపోయింది.

"వంటయింది. ఆకలి లే దేమిటమ్మా" అంటూ వంటలక్క వచ్చి పిచ్చికళని పిలిచింది.

"దేనికయినా గడియ రావాలి" అంటూ గంగమ్మ లేవంగానే అందరూ భోజనానికి లేచారు.

౫

గంగమ్మగారింట ఉండినంతసేపూ రాజేశ్వరికి నరకంలో ఉండిన ట్టనిపించింది.

"ఏమి టీవిడ్డూరం ? మధుసూదనరావు కేమిటి, ఇండియా ప్రభుత్వంలో మంత్రిత్వ మేమిటి ? పిచ్చి కళకి అమెరికాలో ఉద్యోగమా ! నిజంగా ఆ కుటుంబం అంత ఉన్నతపదవికి వచ్చే అవకాశా లున్నాయా?" ఆమె నమ్మలేకపోతోంది. మళ్లా అంత లోనే నమ్మకుండా ఉండనూ లేకపోతోంది.

ఆక్షణంలో మధుసూదనరావుఎదుట తన పెనిమిటి పంకా లాగే పరిచారకుడులా గోచరిస్తున్నాడు.

మధుసూదనరావూ బి. ఎల్; తన పెనిమిటీ బి. ఎల్. ఒకరికి రాచరికమూ, మరొకరికి బీదరిక మూనా ? తన పెనిమిటి ఇంకా డిస్ట్రిక్టలెక్టరయినా కాలేదు. జిల్లాకలెక్ట రేమవుతాడు ?...

హరనాథబాబాఎదుట చేతులు జోడించి "ప్రభూ"అని వలవల ఏడిచింది రాజేశ్వరి.

ఎదుటింటి గంగమ్మ తనని వెక్కిరిస్తోంది. పిచ్చి కళ విమానం ఎక్కి తనని హసిస్తోంది.

ఏమిటి చెయ్యడం ?

గంగమ్మగారింటిలో జోస్యం చెప్పిన ఆ గడ్డం పండితుడు ఎంత గొప్పవాడో ! అతడు చెప్పింది అబద్ధం అవుతుందా ? ఒకసారి ఆ దాడీవాలాని పిలిపించి, తన పెనిమిటి అదృష్టమూ, కొడుకు అదృష్టమూ చెప్పించుకోవాలని ఆమెకు కోరిక పుట్టింది.

కాని అంతలోనే భయం. ఆ జ్యోతిష్కుడు వచ్చి తన పెనిమిటి జీవితంలో జిల్లాకలెక్టరయ్యే గీత లేదు; నీవు ఎందుకు దుఃఖిస్తావని, కుండ పగలకొట్టి నట్టు నిజం చెప్పివేస్తాడేమో నని ఆమెగుండెలో దడ బయల్దేరింది.

ఏపనిమీద వెళ్లాడో రాజశేఖరరావు ఇంకా ఇంటికి రాలేదు. కూతురు చంద్రకళ పడకకుర్చీ లో పండుకొని చదువుకొంటోంది. వీరయ్య వంట పూర్తి చేసి దొడ్డిలో గుడ్డలు పిండుతున్నాడు. వీధిలో ఎండ తీక్ష్ణంగా కాస్తోంది.

రాజేశ్వరి వీణ తీసింది. కళ్లు తుడుచుకొంది. శ్రీరాగం ఆలాపన చేసింది. త్యాగయ్యగారి రామ కీర్తన పాడింది. పంచమస్థాయిలో కంఠం పైకెత్తి 'రామా'...అని వెర్రికేకపెట్టి వీణమీదికి వొరిగి పోయింది.

వీధిలో 'సోది అడుగుతారా అమ్మా, సోది, సోది' అని కేక వినవచ్చింది. రాజేశ్వరి దొడ్డివాకిట సోదెతను లోపలికి పిలిచింది. చేటలో బియ్యం పోసి ఆమెఎదుట కూర్చుంది.

ముక్కున నత్తూ, మొఖాన్న రూపాయికాసంత కుంకుమబొట్టూ, చేతుల కిల్లారిగాజులూ, ముడతలు బడిన శరీరం, మోచేతులు తాకేరవికె—పండిన ముత్తైదువ ఆ సోదెత.

రాజేశ్వరిదుఃఖం కొంత ఉపశమించింది. తన చెయ్యి ఆమెచేతిలో పెట్టింది. సోదెత అందిచ్చిన కర్ర పట్టుకుంది.

ఏవో దీర్ఘాలు తీస్తూ చెప్పతోంది సోదెత. ఆమె చెప్పేదానిలో ఒకదాని కొకటి అన్వయం కావడంలేదు.

"నీమనస్సులో ఒక దొడ్డకోరిక ఉందాది.  
అది దొడ్డదంటే దొడ్డది కాదు.  
గొప్పదంటే గొప్పది కాదు.  
చిన్నదంటే చిన్నది కాదు.  
అది చాలా లావు కోరిక.  
నీపెనిమిటికి రాజభోగం కలుగుతాది—"

అని చెప్పింది.

రాజభోగం అనే మాట రాజేశ్వరి చెవులకు తియ్యగా తగిలినా, ఆమెకు గంగమ్మగారింట విన్నంత తృప్తికరంగా ఉండలేదు. ఇంకా వివరాలు చెప్పవలసిం దని కోరిందిగాని, ఆసోదెత అంతకంటే చెప్పలేక—

"నీకు బంగారుకొడుకు పుట్టుతాడు.
మనమలు పుట్టుతారు.
కోడళ్లు వస్తారు........బంగారు తల్లి."

అని చెప్పి రాజేశ్వరిగడ్డం ముట్టి చేటలో గింజలు బుట్టలో వేసుకొని చక్కా లేచిపోయింది.

౬

రాజశేఖరరావుకు ఉద్యోగంలో క్షణం తీరిక గావడం లేదు. యుద్ధం పూర్తిఅయిందన్నమాటేగాని దేశంలో ఏవస్తువు బట్టినా కరువయిపోయింది. బియ్యం కరువు, పప్పులు కరువు, చక్కెర కరువు, కిరసనాయిలు కరువు, గుడ్డ కరువు—ఒకటేమిటి, మనిషి జీవించడానికి అవసరమైన ప్రతివస్తువుకీ కంట్రోలూ, రేషనింగూను! ప్రతీ కంట్రోలూ తహశిల్దారుఆధ్వర్యాన జరగవలసి ఉంది.

రాజశేఖరరావు తెల్లవారి నిద్రలేవడం భయం—రేషన్‌షాపులో బియ్యంలేవంటున్నారనీ, స్టోరులో చక్కెర అయిపోయిందని బోర్డు తగిలించారనీ, కిరసనాయిలు లేదంటున్నారనీ, చీకటిలో పడి చావమంటారా అనీ, మనిషి చచ్చిపోతే పీనుగుమీద కప్పడానికి జానెడు గుడ్డ దొరకలేదు, బజారులో ఆ పీనుగు కదిలేఎత్తు ఎట్లా అనీ, బ్రదికినవాళ్లు మొలకి చుట్టుకోను గుడ్డ లేక అల్లాడిపోతూంటే చచ్చినవాండ్లకు తొందర వచ్చిందా?—అంటూ ఇంటిచుట్టూ చుట్టుకొంటున్నారు జనం.

పైగా ప్రతిగ్రామంలోను పార్టీలూ, రైతు సంఘాలూను. ఈ పార్టీలుగాక కమ్యూనిస్టులందరూ చేరి ఇంకో పార్టీ.

స్టోరులో ఏ వస్తువయినా రావడం భయం. ఈ అన్నిపార్టీలూ ముట్టడించి రాజశేఖరరావును అడకత్తెరలో నొక్కినట్లు నొక్కేస్తున్నారు. చక్కెర కోటా మితంగా వస్తోంది. కాబట్టి కాఫీ తాగేవాళ్లకు మాత్రమే చీట్లిచ్చి రేషనింగు పెట్టండని ఒక పార్టీ అంటే, నీవేనా కాఫీ తాగేది, మేము తాగడంలేదా? అని ఇంకోపార్టీవారు వెయ్యిమంది హరిజనులను తీసుకొనివచ్చి తహశిల్దారుగారి ఆఫీసుమీదికి దండు పంపుతున్నారు.

అదీగాక, టౌన్‌లోని కాఫీహోటళ్లవాళ్లందరూ సంఘంగా చేరి, ముందు మాకు ముప్ఫయి బస్తాల చక్కెర కేటాయిస్తేనేగాని వీల్లేదని ఒక అర్జీ. సోడాషాపులన్నీ ఒక సంఘంగా చేరి నెలకి పాతికబస్తాలయినా మాకు విడదొక్కితేనేతప్ప లేకపోతే మేము వ్యాపారాలు చాలించుకోవలసినట్టుగా ఉన్నదని మరొక అర్జీ. మిఠాయిఅంగళ్లవాళ్ల సంఘంతరఫున ఒక పాతికబస్తాలకు డిమాండు. హాస్పిటల్లో రోగులకుగాను అర్జంటుగా అయిదుబస్తాలు పంపవలసిందని డాక్టరు దగ్గర నుండి ఒకలెటరు, పోలీసుసిబ్బందికంతా చేరి అయిదుబస్తాలయితే చాలు, వెంటనే రిజర్వుచేయించవలసిందని పోలీస్ ఇన్‌స్పెక్టరువారినుండి ఒక ఎక్స్‌ప్రెస్ మెసేజి(*Express message*). ప్రత్యేకం బ్రాహ్మణవీథి కుటుంబాలకు పది బస్తాలు మామొఖాన్న కొట్టండి. మేమే పంచుకొంటాం అని ఒక ఆందోళన, మేము ఇన్‌కంటాక్సుకట్టే వర్తకులం; సేల్సుటాక్సు కట్టే వర్తకులం: మాకు రోజుకి ఆరుసార్లు కాఫీతాగే అలవాటు. మా సంఘానికి ఇరవై బస్తాలు సప్లయిచేస్తేనేగాని బ్రదకలేమని ఇంకో ఆందోళన. మేము మగ్గాలునేసుకొని బ్రదికేవాళ్లం. రెండువందల కుటుంబాలవాళ్లం. కాఫీ తాగనిది మేము మగ్గం ఆడించలేం. కాబట్టి మాకు ఇరవై బస్తాలు కేటాయించవలసిందని మీటింగులూ, ఉపన్యాసాలూను!

ఇట్లా ఉండగా ఈ తహశిల్దారు ద్రవ్యవంతులకేగాని బీదవారికి ఒక్కతులం చక్కెరకూడా చిక్కకుండా చేస్తున్నాడని కమ్యూనిస్టులీడర్లు కలెక్టరుకు టెలిగ్రాములు.

ఆమధ్య గవర్నమెంటువారు కొబ్బరినూనెమీద కంట్రోలు పెట్టారు. ఇంకా కంట్రోలు పూర్తిగా

అమల్లోనికి రానేలేదు. అదివరకు ఏ అంగడిలో పట్టినా దిబ్బలుదిబ్బలుగా పడిఉండే కొబ్బరినూనెడబ్బాలు క్షణికంలో అదృశ్యమైపోయి—"ఈ అంగడిలో కొబ్బరిచమురు అడుగవద్దు." అని బల్లలు కట్టేశారు వర్తకులు. మూడునాలుగు నెలలుగా తలకు రాచుకోను కూడా చమురు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని రాజశేఖరరావు కలెక్టరుకు వ్రాస్తే, మలబారునుండి టౌన్ స్టోరుకి యాభైడబ్బాల సప్లయికి ఉత్తర్వులు పంపాడు కలెక్టరు.

డబ్బాల వాగను యింకా స్టేషన్‌లో దిగనే లేదు—వేలకు వేల జనం స్టోరుమీద విరగబడిపోతున్నారు. మిషన్ కుట్టువాండ్లందరూ చేరి—కొబ్బరిచమురు లేక మా మిషన్లు మూలబడ్డాయి, ఆ యాభయి డబ్బాలలో పదిడబ్బాలు ముందు మాకు రిజర్వుచేయవలసిందని అప్పుడే రాజశేఖరరావుకు అర్జీలు యిచ్చివేశారు. చేతిమీద నెయ్యికిబదులు కొబ్బరిచమురు వేసుకొని తినే అలవాటుగల పది మళయాళకుటుంబాలు ఒక సంఘంగా చేరి, ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క డబ్బా అయినా రిజర్వు చేయవలసిందని ఇంకో అర్జీ యిచ్చారు. ప్రతీగవర్నమెంటునౌకరుకుటుంబానికీ అర్ధమణుగుచొప్పున సప్లయిచేస్తేనేగాని, అసలు సర్కారుపని చేయడానికే మాకు ఇబ్బందిగా ఉన్నదని ఒక డిప్యుటేషన్. ఆ యాభై డబ్బాలూ టౌన్‌లోనే ఖర్చుపెట్టితే ఎట్లా, పల్లెలకి సగానికి సగం డబ్బాలయినా కేటాయించవలసిందని తాలూకా కమిటీలో ఒక ప్రతిపాదన.

రాజశేఖరరావుకు తల పగిలిపోతోంది.

పట్టపగలు వాగనులోనుంచి బహిరంగంగా తీసుకొనివస్తే, ఉడికిపోతున్న జనం ఏమి దొమ్మీ చేస్తారో అని, రాత్రిపూట ఎవరికీ తెలియకుండా యాభైడబ్బాలూ లారీలో తెప్పించి స్టోరుగదిలో పెట్టి, తాళం వేసి, సీళ్లు వేశారు స్టోరువాండ్లు.

ఇంతలో కమ్యూనిస్టులీడర్లు తహశీల్‌దారు ఎదుట ప్రత్యక్షమై—

"ఈకొబ్బరిచమురు పంపకంవిధానం మాచేతిలో పెట్టండి సార్. జాతి, మత, కుల, వర్గ, సంఘ, రాజకీయ భేదాలు పాటించకుండా, చడీ చప్పుడూ లేకుండా మేము పంపకం చేసేస్తాం" అని ఆరంభించారు.

"ఈ పంపకవిధానంలో కమ్యూనిస్టుల కవకాశం యిచ్చినట్టయితే మీఉద్యోగానికే ఘనమోసం రాగలదు—జాగ్రత్త"అని ఒక కాంగ్రెస్సునాయకుడు రాజశేఖరరావును హెచ్చరికచేస్తున్నారు.

"కొబ్బెరచమురు పంపకానికీ, రాజకీయాలకీ సంబంధంలేదు. మేము ప్రజాక్షేమం కోరి ఈవిషయంలో అధికార్లకు సహాయపడి న్యాయం చేయడానికి వచ్చాం"అన్నాడు కమ్యూనిస్టు.

"కమ్యూనిస్టుకూ న్యాయానికీ చాలా దూరం. ఏకార్యకలాపంలోగాని కమ్యూనిస్టులతో చేతులుకలిపి ఏకాంగ్రెస్సుమనిషీ పనిచేయకూడదని హైకమాండు మాకు ఉత్తర్వులు చేశారు సార్." అన్నాడు కాంగ్రెస్సునాయకుడు.

"ఆహా! ఏమి న్యాయమండీ! బజారులో కొంపలంటుకొని తగులబడిపోతూంటే కమ్యూనిస్టులు కుండలతో నీళ్లు పోస్తున్నారుకాబట్టి, నేను ఆపక్కకి పోకూడదనేనా ఈయనగారి సిద్ధాంతం...?"అన్నాడు కమ్యూనిస్టు.

"మాకీ సిద్ధాంతాలూ, ధర్మప్రశ్నలూ తెలియవండీ!" అన్నాడు కాంగ్రెస్సునాయకుడు.

"అసలు కాంగ్రెస్సుప్రభుత్వం ఈ రేషనింగు విధానాన్ని యావద్భారతదేశంలో అమలుపెట్టడంలో ఏసిద్ధాంతాన్ని అనుసరిస్తున్నదో యోజించండి. రేషనింగు అంటే ఏమిటి? దేశంలో ఉత్పత్తిఅయిన సంపద ప్రతీఒక్కడికీ సమానంగా పంచిపెట్టవలసిందనేగదా అర్థం. అదే మేము కోరేదీని." అన్నాడు కమ్యూనిస్టు.

రాజశేఖరరావు చకితుడైపోయాడు.

"ఇంకో సంగతి: గ్రామాలలో ధాన్యం పండించే రైతువద్ద ధాన్యసేకరణ చేసి ప్రజలందరికీ రేషన్ పెట్టమన్నారంటే, కలిగిన మహారాజుదగ్గర బలవంతాన అయినా పెరుక్కొని లేనివాళ్లకు పెట్టి బ్రదికించుమనేకాదా అండీ అభిప్రాయం ?" అని మళ్లా మొదలకించుకున్నాడు కమ్యూనిస్టు.

కాంగ్రెస్సునాయకుడు చప్రున లేచి చక్కా వెళ్లిపోయాడు.

"నేను ఆలోచించి యేదోవిధంగా పంపకం చేస్తాను, మీరు వెళ్లం"డని రాజశేఖరరావంటే, థాంక్సు చెప్పి వెళ్లిపోయాడు కమ్యూనిస్టు.

ఆతర్వాత రాజశేఖరరావు లెఖ్ఖలు వేసి టౌనులో ఒక్కొక్క బియ్యంరేషన్ కార్డుమీద అయిదేసి పలాల వంతున పంపకం చేయుమని స్టోరువాండ్లకు ఉత్తర్వులు వేసిపంపాడు.

ఈసంగతి గ్రామంలో తెలిసి తెల్లవారేసరికి స్టోరుమీదికి వేలకువేలజనం విరగబడిపోతున్నారు. 'డబ్బాలు బయటికి తీయండి, సీళ్లు పగలగొట్టండి' అని కేకలు. ఈదెబ్బకు జడిసి పోలీసులను పిలిచి బందోబస్తు చేయిస్తున్నారు స్టోరువాండ్లు.

మీరు స్వయంగా వచ్చి, నిలబడితేనే గాని ఈ గుంపులో డబ్బాలు బయటపెట్టడానికి భయంగా ఉన్నదని తహశీల్దారుకు కబురుచేశాడు స్టోరు మానేజరు.

"ఈ తహశీల్దారు ఏ విధంగా పంపకం చేయిస్తాడోకదూ, చూతాం" అని కమ్యూనిస్టులు ఓవెయ్యిమంది హరిజనులను బియ్యంరేషన్ కార్డులతో స్టోరుమీదికి పంపితే—

"కమ్యూనిస్టులేనా ప్రజాసేవ చేసేవారు, మేముమాత్రం చేయలేమా!"అంటూ మధుసూదనరావూ, కాంగ్రెసువాండ్లూ ఇంకోవెయ్యిమందిని లేవదీసి స్టోరుమీదికి దండు పంపారు.

సద్దుచేయవద్దని అంటూ లాఠీఛార్జి చేస్తున్నారు పోలీసులు. గుంపులో ఆడవాండ్లూ, ముసలివాళ్లూ, పిల్లలూ తోసుకొని ఒకరిమీద ఒకరు పడి కొబ్బరిచమురుకోసం తెచ్చుకొన్న సీసాలు పగిలి, కొందరేడుస్తూంటే, ఆ సీసాముక్కలు తొక్కి కాళ్లు తెగి రక్తప్రవాహమై మరికొందరేడుస్తున్నారు.

కమ్యూనిస్టుల కావేశం పెరిగి—

"రక్తపాతానికి జై! స్టాలిన్‌కూ జై! లెనిన్‌కీ జై!" అని అరవడం ఆరంభం చేశారు.

"గాంధీమహాత్మకూ జై! జవహర్లాలుకూ జై! భరతమాతకూ జై!" అని కాంగ్రెస్‌వాండ్లు కేకలు పెట్టుతున్నారు.

రాజశేఖరరావూ, పోలీసుఇన్‌స్పెక్టరూ అమిత కష్టంమీద స్టోరుకొట్టుదగ్గరకు వెళ్లి, సీళ్లు పగలకొట్టి, తాళం తీయించారు. ఒక్కొక్క డబ్బా బయటికి తీసి మూతలు పగలకొట్టించారు. కాని ఆ యాభయిడబ్బాలలో ఒక్కడబ్బాకూడా కొబ్బరిచమురుడబ్బా లేదు. అన్నీ ఆముదండబ్బాలే!

జనం గొల్లుమని కేకలేశారు.

"ఇది అంతా స్టోరువారి కుట్ర"అని కమ్యూనిస్టులు గలభా చేస్తే, "ఇది అంతా తహశీల్దారు చేసిన మోసం"అని మధుసూదనరావూ, కాంగ్రెస్‌వాండ్లూ కేకలు పెట్టి వెళ్లిపోయారు.

ఆ తర్వాత విచారణ జరిపి విషయం తెలుసుకొంటే, ఈ యాభయిడబ్బాలూ అంబాజీపేటనుండి మలబారుకు పోవడంలో, దారిలో ట్రాన్‌షిప్పుమెంటులో రైలువాళ్ల పొరపాటున కొబ్బరిచమురుడబ్బా లెక్కించవలసిన వాగనులో ఆముదండబ్బాలూ, ఆముదండబ్బా లెక్కించవలసిన వాగనులో కొబ్బరిచమురుడబ్బాలూ ఎక్కించారని రైల్వేనుండి తహశీల్దారుకు జవాబు వచ్చింది.

ఈ విధంగా కంట్రోలువిధాన నిర్వహణంలో సతమతమైపోతున్నాడు రాజశేఖరరావు. కాని ఈ కంట్రోళ్ల పరిపాలన ఒకానొక మారణయంత్రం అయి

పోయింది. ప్రజలలో అవినీతీ, మోసమూ, దొంగతనమూ, అబద్ధమూ, భయమూ, ఈర్ష్యా, అసూయా, పిరికితనమూ—ఒకటేమిటి, ఒక మానవజాతి సమూలంగా నాశనం కావడానికి ఏర్పడిన వేరుపురుపులా పరిణమించింది. ఏవస్తువుగాని ప్రజలు మోసం ఉపయోగించనిదే దొరకడం లేదు.

ఒక్కొక్క యింట్లో ఎంతమంది ఉంటే అంతమంది పేర్లతో వేర్వేరు దొంగరేషన్ కార్డులు సంపాదించుకొని తమకు చట్టసమ్మతంగా రావలసినదానికంటే పదిరెట్లు ఎక్కువ తెచ్చుకొని యింట్లో పెట్టుకొంటున్నారు జనం. లెక్కల పుస్తకాల్లో దొంగనెంబర్లు వ్రాసి, ఒకరికి తెలియకుండా మరొకరు తమ యింటికి బియ్యం, పప్పూ చేర్చుకొంటున్నారు రేషన్ షాపుల్లోని సేల్సుమెన్. ఒక్కొక్క కార్డుకి పావలా వంతున లంచం తీసుకొని, దొంగపేర్లతో టెంపరరీ కార్డు లిస్తున్నాడు అని గ్రామమునసబుమీద పితూరీ. దొంగకార్డులద్వారా సంపాదించిన వస్తువులు దొంగతనంగా పరాయి గ్రామాలలో బ్లాకుమార్కెట్టులో అమ్ముతుంటే—తహశీల్ దారుగారూ, మీ రేమిచేస్తున్నారని ఆకాశరామన్న ఉత్తరాలు. పంటపండించిన రైతు ధాన్యం దాచిపెట్టి, ప్రక్కజిల్లానుండి వచ్చిన దొంగవర్తకులకు అమ్ముకొని, తన యింట్లో తిండికి లేవని రేషన్ కార్డు తీసుకొని సర్కారును మోసం చేస్తుంటే నిద్రపోతున్నారా తహశీల్ దారుగారూ అని బయట ఔటాలో గోడలమీద కాగితాలు. రేషన్ షాపులో పిచ్చ శేర్లూ, పిచ్చకొలపాత్రలూ ఉపయోగించి కొలుస్తున్నారు. గింజలు ఇంటికి తీసుకొని పోయి దంచుకొంటే మనిషికి నాలుగవున్నలుకూడా గిట్టుబాటు కావడంలేదు - మమ్మల్ని చావుమంటారా అని హరిజనుల మహజర్లు !

రాజశేఖరరావుకు తన ఉద్యోగం ఒక సాధకరంగం అయిపోయింది. ఒక కురుక్షేత్రం అయిపోయింది: తన దేశం, తన ప్రజలు ఏమయిపోతున్నారో, తాను ఎక్కడికి పోతున్నాడో—తలచుకొంటే అతనికి కడుపులో ఆవేదనగా ఉంటోంది.

౭

"ఏమండీ ! ఇదేమి ఉద్యోగమండీ ! నావైపు చూడండీ ! రోజుకి ఇరవై నాలుగుగంటలలో మీరు ఎన్నిగంటలు ఇంట్లో నిలుస్తున్నారు ? మీరు వేళకి తిండితిని, కంటినిండా నిద్రపోయి ఎన్నిరోజులయింది ?"

"... - ..........."

"పట్నంనుంచి అబ్బాయి రెండు ఉత్తరాలు వ్రాశాడు. నేనే సమాధానం వ్రాశాను. నాన్నగారి దగ్గరనుండి ఉత్తరం లేదేమమ్మా అని వాడు ఊదవుతూ మళ్లా వ్రాశాడు. వాడికో కార్డుముక్కయినా గీచిపారెయ్యడానికి తీరిక లేదే మీకు, ఏమిటీ విడ్డూరం ?"

"... ..........."

"అమ్మాయిచంద్రకళ మొఖం చూడడం మానేశారు. వంటపూటింటికి వచ్చినట్టు చెప్పుల్లో కాళ్లు పెట్టుకొని రావడం, రెండు మెతుకులు నోట్లో వేసుకొని వెళ్లడమూను. ఇట్లా తిరిగితే వొళ్లు చెడిపోదూ ?"

"..............."

"మీరు కంఠమెత్తి జయదేవుని అష్టపది పాడి ఎన్నిరోజులయింది?పాటకూడా మరచిపోతున్నారు."

"..............."

"లోకంలో తహశీల్ దార్లందరూ ఇట్లాగే వొళ్లు విరుచుకొని పనిచేస్తున్నారా ?......"

"వాళ్ల అదృష్టం—"

"పోనీ, ఇంత కష్టపడుతున్నారు. మున్నాట అరవయిరోజులూ డ్యూటీ, డ్యూటీ అని మీ నెత్తురూ మాంసమూ ధారపోస్తున్నా, మిమ్మల్ని డిప్టీకలెక్టరుగానయినా ప్రమోషన్ చేశాడా కలెక్టరు ?"

"నెలకి రెండువందల రూపాయలుజీతం ఇవ్వడంలే ?"

రవంత స్తిమితంగా తన పెనిమిటితో కాలక్షేపం చేయడానికి మనసయిపోయింది రాజేశ్వరికి.

రాత్రి పదిగంట లయింది.

భోజనం చేసి మిద్దెమీద వసారాలో పందిరి మంచంమీద ఉస్సురంటూ ఘటం చేరవేశాడు రాజశేఖరరావు. వేసవికాలం తీవ్రత తగ్గినా చల్లదనానికి ఇంకా తహతహలాడిపోతున్నారు జనం. దశమి చంద్రుని తెల్లని వెన్నెల రాజశేఖరరావు పండుకున్న పాన్పుమీద పలుచగా పడుతోంది.

ఒక్కసారి లేచి ప్రక్కమంచంమీద నిద్రపోయే చంద్రకళని చెంపలు నిమిరి ముద్దుపెట్టుకొన్నాడు రాజశేఖరరావు.

"నిద్రపోయే పిల్లని ముద్దుపెట్టుకోకండి" అని వారించింది రాజేశ్వరి.

కొబ్బరిచెట్టుమీద రెండు తెల్లటి కొంగలు కువకువమని కూతపెట్టుతున్నవి.

పెనిమిటిపై ప్రాలి తమలపాకుల చిలకలు నోటి కందిస్తోంది రాజేశ్వరి. తన ప్రేమరాశితో ఇరవై ఏళ్లుగా కాపురంచేస్తోంది. ఎన్నెన్ని అమరసుఖాలలో అతనిజీవితంలో భాగం పంచుకొన్నది. అతనిమీది తీపి ఆమెకు దినదినమూ కొత్తరుచులను తెచ్చిపెట్టుతోంది. కాని—కాని—కాని- పూర్ణచంద్రబింబంలో ఒక మచ్చ: ఒక కళంకం. తన పెన్నిధానం ఇంకా తహశీల్దారే! ఇదే ఆమెదిగులు—

"నారాజుకి సుఖం లేదు..." అని ఒక వేడి కన్నీటిబిందువు అతని కపోలంమీద విడిచింది రాజేశ్వరి.

"ఏమి చేయుమంటావు రాజేశ్వరీ! ఎంత కష్టపడినా పల్లెల్లో రైతులు ఒక్క గింజకూడా బయటపెట్టడం లేదు. సర్కారుధరలు గిట్టుబాటు కావడంలేదని వాండ్లు బ్లాకుమార్కెట్టులో పుట్టి నాలుగువందలకి అమ్ముకొంటున్నారు"

"అమ్ముకోనీయండి! ఏ బ్లాకుమార్కెటులో నయినా కొనుక్కొని ప్రజలు బ్రతుకుతున్నారుగాని చావడం లేదే!"

"బియ్యం లేవని టౌనులో జనం ఆందోళన చేస్తున్నారు. నీతాలూకాలోనే ధాన్యం సేకరించి సప్లయిచేయవలసిన బాధ్యత నీ నెత్తిమీద ఉన్నదని ఉత్తర్వులు పంపాడు కలెక్టరు. కాని ఒక్కరైతు కూడా గింజ బయటపెట్టడంలేదు."

"బయటపెట్టకుంటే గవర్నమెంటు ఊరుకో వలసిందే ?"

"దౌర్జన్యం ఉపయోగించి కొలిపించుకోవాలి."

"ఉపయోగించండీ!"

"ఎన్నిరోజులని దౌర్జన్యం ఉపయోగిస్తావు, ఎంతమందిమీద ఉపయోగిస్తావు ?"

"అందుకని ?"

"ప్రజల సహకారం లేనిదే జరిగే పనులు కావివి."

"నిజమే."

"ఈమన్య దౌర్జన్యంకూడా ఉపయోగించి చూచాను. పోలీసులను తీసుకొని గ్రామంమీద పడ్డాం. రైతులందరూ ఒక సంఘం. మమ్మల్ని చూచి ఒక్కసారిగా అందరూ ధాన్యపుకొట్లకు బీగాలు బిగించి ఊరువిడిచి చెరువుకట్టక్రింద మామిడితోపులో మీటింగు పెట్టుకొన్నారు."

"తాళాలు పగులగొట్టలేకపోయారా ?"

"గ్రామమునసబూ, కరణమూ రైతులతో చేరిపోయారు. తాళం పగలగొట్టడానికి కంసాలిబత్తుణ్ని పిలిపించుమంటే మావూళ్లో బత్తుడు లేడన్నారు."

"........................"

"మేమే పగలగొట్టుకొంటాం, ఒక ఇనుప కర్ర తెప్పించుమని అడిగాను మునసబుని—"

"అదీ లేదన్నాడా ?"

"ఇనపకచ్చేరు సప్లయిచేస్తే మునసబు గ్రామంలో కాపురంచేయగలడా ? అంతట పోలీసులచేత తాళం పగలగొట్టించాను. ధాన్యం ఎవరు కొలుస్తారు ? కొలిచే మనిషిగాని, కొలవడానికి కుంచంగాని లే దన్నాడు మునసబు."

"........................"

"గ్రామనౌకర్లు మొఖం తప్పించారు."

"ఆ!......"

"పోలీసు హెడ్ కానిస్టేబిలు రైతులతో లాలూచీ పడ్డాడు—"

"కలెక్టరుకు ఈ సంగతులు రిపోర్టుచేయలేక పోయారూ? "

"స్వయంగా వెళ్లి చెప్పివచ్చాను. అవసరమైతే రిజర్వుపోలీసులను ఇస్తాను, నీవూ, డిప్టీకలెక్టరూ వెళ్లి అడ్డంవచ్చినవాండ్లను కాల్చిపారెయ్యండన్నాడు కలెక్టరు."

"........................"

"రైతుసంఘానికి మధుసూదనరావు సలహా ఇచ్చే అడ్వకేటుట !"

"ఇకనేం?..."

"మీరు ధాన్యం కొలవద్దు. అధికార్లు గ్రామానికి వస్తే త్రాగను మంచి నీళ్లయినా ఇవ్వకుండా సత్యాగ్రహం చేయం డని సలహా ఇచ్చాడట ఈయన గారు—"

"ఆహా !"

"ఇది గాంధీశకం. ప్రజలు తమ హక్కులు నిలబెట్టుకోవాలంటే సత్యాగ్రహం అనే ఆయుధం ఒకటే మహాత్ముడు ప్రసాదించాడు. కాబట్టి దానిని ఉపయోగించవలసిం దని ఈ అడ్వకేటుగారి హితబోధనలట !"

"గాంధీగారి సత్యాగ్రహం చివరికి ఇట్లా పరిణమించిందా ?"

"అంతటితో నిలవలేదు ఈ సత్యాగ్రహోద్యమాభిలాషి. 'అంతగా పోలీసులుగాని, అధికార్లుగాని దౌర్జన్యంగా మీ ఇళ్లల్లో దూరినట్టయితే మిరపకాయ కారం వాళ్ల కళ్లల్లో కొట్టం' డని అతని సలహాఅట !"

"అయ్యో !..........."

"................"

"ఇది విన్నారా! మొన్న వాండ్ల యింటికో జ్యోతిష్కుడు వచ్చి, మధుసూదనరావుకీ, పిచ్చికళకీ ఏవో గొప్ప ఉద్యోగా లవుతా యని చెప్పాడు. అది విని గంగమ్మగారూ, ఆవిడ పెనిమిటీ భూమిమీద నిలవడం లేదు—"

"ఏమి ?—"

"మధుసూదనరావు ఇండియాగవర్నమెంటులో ఆర్థికశాఖామంత్రి అవుతాడట ! పిచ్చికళ అమెరికా రాయబారిగా వెళ్లుతుందట ! సర్కారు డబ్బంతా వాళ్లిద్దరి దేనట !........"

"మంచిదే !......ఆంధ్రులలో ఒక్కడయినా ఇటువంటి పదవికి రావడం మనం గర్వించవలసిన విషయం..."

"నెహ్రూగారి దగ్గరనుండి టెలిగ్రాం వస్తుం దని వాళ్లు ప్రతినిత్యమూ ఎదురుతెన్నులు చూస్తున్నారు."

"సంతోషం..........."

"వాండ్ల గొడవ మనకేం గాని, మీ ప్రమోషన్ సంగతి కలెక్టరును అడగకపోయారూ ?"

"మనం అడగకపోతే ఇవ్వడా ?"

"అడగనిది అమ్మయినా పెట్టదు గదా? అందరు తహశిల్ దార్లూ వెళ్లి ఆశ్రయిస్తుంటే మీరుమాత్రం వెళ్లకూడదూ ?"

"ప్రమోషన్ అనేది నా మొఖం చూచి ఇస్తాడా, లేక పనిని చూచి యిస్తాడా ?..."

"ఈరోజుల్లో పనిని చూచి ఇచ్చేటట్టుగా కనిపించదు."

"అట్లయితే నా బ్రాహ్మణమొఖం చూస్తే అసలే ఇవ్వడు కలెక్టరు."

"..............."

"మన భావిభాగ్యోదయం, మన జీవితశోభ, మన అదృష్టం కలెక్టరుచేతిలో ఉన్నదనేనా నీ నమ్మకం రాజేశ్వరీ ?......"

"................"

"కలెక్టరునీ, మంత్రులనీ పోయి ఆశ్రయించుమంటావా ? నాకు ప్రమోషన్ ఇవ్వవలసింది, దేహి అని నేను కలెక్టరుని నోరువిడిచి అడుగగలనా ? నేనిప్పుడు తహశిల్ దారీ చేసి బ్రతకడంలే ? నీవూ, నేనూ అన్నం లేక పస్తుపండుకుంటున్నామా ? నిన్నూ, నన్నూ, కలెక్టరునీ, మంత్రులనీ కాపాడేవాడు ఈశ్వరుడు. సర్వరక్షకుడు ఆయనే!..."

రాజేశ్వరి అతనిమొఖంలోకి వెర్రిగా చూచింది. దశమి చంద్రుడు గడియలు గడిచి పడమటికి దిగజారేడు. పెనిమిటిశయ్యమీద జర్రున జారిపోయింది రాజేశ్వరి.

౨

జగన్మోహనగోపాలపుర మని ఆవూరు పేరు... గోపాలపుర మనే పిలుస్తారు. రాజశేఖరరావు తహశీల్ దారీ చేసే కొత్తపట్నానికి తూర్పు పదిహేను మైళ్ల దూరంలో ఉంటుంది.

ఆదిలో అది ఒక అగ్రహారగ్రామ మని అంటారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలోనో, ఇంకా అంతకుపూర్వమో ఒక మహామంత్రవేత్త అయిన బ్రాహ్మణుడికి ఈ గ్రామం సర్వదుంబాలా ఇనాం గ్రామంగా దానం చేశారనీ, ఆ బ్రాహ్మణుడు దీనికి గోపాలస్వామి పేరుతో 'జగన్మోహనగోపాలపుర' మని పేరుపెట్టుకొన్నాడనీ ఒక పురాతనగాథ చెప్పుకొంటూ ఉంటారు. అది ఎంతవరకు నిజమో చెప్పలేం గాని దరిమిలా ఈ గ్రామంలో జరిగిన ఒక సంఘటన మాత్రం ప్రజలలో ఇప్పటికీ ప్రసిద్ధిగా నిలిచిపోయింది. ఏమిటంటే :

ఆ వూళ్లో గోపాలయ్య అని ఒక రైతు ఉండేవాడట! అతడు పెద్దమనిషీ, సంపన్నగృహస్థూ, బ్రాహ్మణ దైవభక్తి గలిగినవాడూ అని చెప్పుతారు.

గ్రామానికి ఉత్తరంగా సమీపంలోనే అతనికి ఏడెనిమిదెకరాల ములుంతోట ఉండేదట. ఆ తోటలో కపిలెబావులక్రింద రాగీ, సజ్జా, మిరపా, గెనుసూ వగైరా మెట్టపైర్లు పండించేవాడట! ఒకసారి ఆ తోటలో పండిన ఎర్రటి మిరపకాయలు కళ్లంలో ఎండకి ఎండవేశాడట.

మధ్యాహ్నం సరిగా ఒంటిగంటయింది. ఎర్రటి ఎండలో ఎర్రటి మిరపకాయలు ఎండుతున్నై. అతని భార్య ఒక ఏడాది చంటిపిల్లవాణ్ణి చంకన పెట్టుకొని పెనిమిటికి పగటి అన్నం తెచ్చి, పిల్లవాణ్ణి క్రిందికి దింపి బావిదగ్గర వేపచెట్టుక్రింద అన్నం పెట్టుతుండినదట. గోపాలయ్య అన్నం తింటున్నాడు. భార్య పెనిమిటితో పిచ్చాపాటీ మాట్లాడుతోంది.

ఇంతలో క్రిందికి దిగిన పిల్లవాడు ఎప్పుడు వెళ్లాడో దేకుకొంటూ మిరపకాయలదగ్గరకు వెళ్లాడు. తల్లీ, తండ్రీ గమనించనేలేదు.

ఎక్కడనుండి వచ్చిందో ఒక వృద్ధసర్పం పిల్లవాడి దగ్గరకు వచ్చి చేటంత తన పడగ విప్పి పిల్లవాడి ఎదురుగా ఆడిస్తున్నదట. పిల్లవాడు ఒక్కొక్క మిరపకాయే తీసి పామునోటి కందిస్తుంటే, ఆ సర్పం మిరపకాయ అందుకొని ప్రక్కనే పెట్టుతోంది.

తల్లికి తటాలున బిడ్డగమనం తగిలి చూడగా, పిల్లవాడు కళ్లంలో నాగుబాముతో ఆడుకొంటుండినాడు.

"అమ్మో!" అని ఆ తల్లి గుండె బాదుకొన్నది. వెర్రికేక వేసింది. తినే అన్నం విడిచి తండ్రి పరుగు పెట్టాడు. త్రాచుపామును సమీపించి, పిల్లవాణ్ణి తప్పించుకోవడం ఎట్లా? ఆ స్థితిలో పామును చంపడం ఎట్లా? పిల్లవాడు ఇంకా పామునోటికి మిరపకాయ లందిస్తున్నాడేగాని తల్లివైపు తిరిగిచూడడమే లేదు. సర్పం పిల్లవాడిమీదనే ఏకాగ్రతలో లీనమై నిలిచింది.

తండ్రికి దిక్కు తోచలేదు. తల్లి మొత్తుకొంటోంది. చుట్టుప్రక్కల ఎవ్వరూ లేరు. తండ్రే మొండిధైర్యం చేసి ఒక బరిశ తీసుకొని పామువెనకనే వెళ్లి సూటిగా దాని పడగమీద కసుక్కున పొడిచాడట: ఆ దెబ్బతో అంతలావు సర్పమూ అక్కడనే ప్రాణం విడిచింది. పిల్లవాడు కెవ్వుమని కేక పెట్టాడు. తల్లి వెళ్లి పిల్లవాణ్ణి తీసుకొంది.

పిల్లవాడి ప్రాణం కాపాడుకోను ఆ రైతు అంతపనీ చేశాడుగాని, తీరా చంపినతర్వాత వృద్ధ సర్పం ప్రాణాలు తీసినందుకు చాలా దుఃఖించాడట. గ్రామంలో పెద్దలను పిలిచి, సర్పం ప్రాణంవిడిచిన చోటనే దానికి మంత్రతంత్రాలతో దహనసంస్కారం చేశాడట!

కాని ఏమి ప్రయోజనం! ఇది జరిగిన ఆరునెలలకి ఆ రైతుకు రెండుకళ్లూ పోయి గ్రుడ్డివాడయినాడనీ, ఆ కయ్యలో మళ్లా ఫలితమనేది ఎటువంటిదో అత డెరుగడనీ, అదొక స్మశానవాటిక అయిపోయిందనీ అంటారు.

తర్వాత ఆ గోపాలయ్య పరమభక్తుడయి, గ్రుడ్డితనంలోనే దేశాటనం చేసి, యాచించి, కొన్ని వేలరూపాయ లార్జించి, ఆ స్థలంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఒకటీ, ఆలయం ఆరంభంచేసుకొని తూర్పుపడమరగా బ్రహ్మాండమైన చెరువు ఒకటీ నిర్మించాడనీ, అదిలగాయతు ఆ గ్రామాన్ని ఆ రైతుపేర గోపాలపురమని పిలుస్తున్నారనీ మరొక గాథ యిప్పటికీ చెప్పుకొంటూఉంటారు ప్రజలు. ఇది ఎంతవరకు నిజమో చెప్పలేం. కాని, అక్కడ చెరువూ, చెరువు కట్టక్రింద సుబ్రహ్మణ్యస్వామి ఆలయమూ ఇప్పటికీ ఉన్నవి. ప్రతి ఏటా సుబ్బరాయషష్ఠికి అక్కడ బ్రహ్మాండమైన తిరునాళ్లు జరుగుతూ ఉంటుంది.

ఏ ఘడియని ఆ చెరువుకు శంకుస్థాపన పడిందో, నీటికి ఒకటోరకమైన వోనరు. ఉత్తరంకొండబోటి మీద చినుకుపడితే చాలు, చెరువులో ఉన్నదన్నమాటే. ఏ ద్వాదశవర్షక్షామమో వచ్చి ప్రపంచం ఎండిపోతే ఏమోగాని, లేకపోతే ఆ చెరువుక్రింద నీళ్లు లేక పైరు ఎండిపోవడం మేమెరగం అని నూరేళ్లునిండిన వయోవృద్ధులు చెప్పుతూఉంటారు.

యుద్ధం వచ్చి బర్మాబియ్యం నిలిచిపోయి, గవర్నమెంటు అధికాహారోత్పత్తిఉద్యమం లేవదీసిన తర్వాత ఆ వూళ్లో హరిజనులు చెరువుక్రింద ఈశాన్య మూల అనాథీనంపొలంలో కనరుగా నూరెకరాల ప్లాటులో ప్రవేశించి తలా అయిదెకరాలవంతున ఆక్రమించుకొని, దానిలో పిచ్చమోసనం, స్వర్ణసంబావు లాంటి మూడేసి నెలల పైర్లు వర్షానికి వెలిదిడికి చల్లి అధికాహారోత్పత్తికి సాయ పడుతూవస్తున్నారు. ఈ ప్లాటులో అదివర కెన్నడూ నాగలి అట్లా మోపిన పాపాన పోయినవా రెవ్వరూ లేరేమో, ఎండకి ఎండి, వానకి చీకి, ఏళ్ల తరబడి సత్తువ చేరుకొన్న పొలమేమో, ఇప్పుడు వెలిదెడికి చల్లినా, వెట్టికి పండినట్టు పండుతోంది, ఎకరానికి పుట్టీ, ఏదుం, పందుమూను.

యుద్ధం పూర్తిఅయినతర్వాత మిలిటరీవాండ్లకూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినతర్వాత కాంగ్రెసులో చేరిన రాజకీయబాధితులకూ ఒక్కొక్కరికి అయిదేసి ఎకరాల చొప్పున భూమి ఉచితంగా సహాయం చేయడానికి తీర్మానించింది జాతీయప్రభుత్వం. ఇక్కడ కొత్తపట్నంప్రాంతంలో గల మిలిటరీ వాండ్లకూ, రాజకీయబాధితులకూ కూడా ఒకేసారి

గోపాలపురంభూములమీద కన్నుపడింది. చాలామంది మిలిటరీవాండ్లూ, కాంగ్రెస్సువారూకూడా హరిజనులాక్రమించుకొన్న నూరెకరాల నట్టుకీ దరఖాస్తులు పంపుకొన్నారు. ఈ దరఖాస్తులు విచారణనిమిత్తం తహశిల్దారు రాజశేఖరరావుకు పంపాడు కలెక్టరు.

మధుసూదనరావుకు ఇంటిదగ్గర పరిస్థితు లేమీ బాగులేవు. గడ్డంజ్యోతిష్కుని వాక్యాలు ఒక్క అక్షరమ్మొక్క కూడా ఇంతవరకూ అమలులోనికి రాలేదు. ఇంతలో వస్తుందన్న ఆశకూడా గోచరించడం లేదు.

"ఢిల్లీనుండి యింకా టెలిగ్రాం రాలే దేమిటిరా అబ్బాయీ?" అని రోజూ గంగమ్మ కొడుకును వేధిస్తూఉంటోంది.

రాష్ట్రీయప్రభుత్వం రాజకీయ బాధితులకు చేసే సహాయం మన మేల పోగొట్టుకోవాలని, ఆలోచించి—

"నేను జైలుకు వెళ్లి బాధపడివచ్చిన కాంగ్రెస్సునాయకుడను. నాది పెద్ద కుటుంబం. పెద్దఎత్తుల్లోమనిషిని. నాకు అయిదెకరాల భూమి యిస్తే చాలదు కాబట్టి నావిషయం ప్రత్యేకంగా ఆలోచించి గోపాలపురంలో హరిజను లాక్రమించుకొన్న నూరెకరాల నట్టులో అధమం ఏభయ్యెకరాలయినా వెంటనే నాస్వాధీనం చేస్తేనే గాని నేను చేసిన త్యాగదాహం చల్లార"దని మధుసూదనరావు నేరుగా ప్రభుత్వానికి అర్జీ పంపించాడు. ఆ అర్జీకూడా రాజశేఖరరావుకు రిఫరయింది.

రిఫరయిన క్షణంలగాయతు రాజశేఖరరావు కాళ్లక్రింద నిప్పులు పోసి కొట్టుతున్నాడు మధుసూదనరావు. తన అర్జీమీద అనుకూలంగా వ్రాయకపోతే పిడుగులు కురిపిస్తా నని తహశిల్దారును బెదిరిస్తున్నాడు.

భూములు తణిఖీచేసి అర్జీదార్లను విచారించడానికి రాజశేఖరరావు గోపాలపురం మకాంచేశాడు మధుసూదనరావుకూడా యితర అర్జీదార్లతోపాటు హాజరయ్యాడు.

"ఈభూములు సర్కారువారి భూములు. అధికాహారోత్పత్తి స్కీముక్రింద హరిజనులు సాగుచేసినప్పటికీ, సర్కారు ఇష్టప్రకారం వాటిని వినియోగించే అధికారం గవర్నమెంటు కెట్లా తొలుగుతుంది? కాబట్టి హరిజనులు భూములు విడుదలచేయవలసిందే" అని మధుసూదనరావువాదన.

"మేము కష్టపడి బాగుచేసుకొన్న భూములు విడిచిపెట్టుతామా, ఎవరికో ఇతరుల కిచ్చేబదులు, ఈ భూములు మాపేరనే శాశ్వతపట్టా లివ్వవలసిందే కాని లేకుంటే ప్రాణా లయినా విడుస్తాం" అని హరిజనుల వాదన.

"సర్కారువారు భూము లివ్వదలచుకుంటే, బీదహరిజనుల స్వాధీనంలో ఉన్న భూములు పెరుక్కొని ఇవ్వడంకంటే, ఈ మహారాజులున్నారే రైతులు, వాండ్లదగ్గరనుండి భూములు పెరుక్కొని మిలిటరీవాండ్లకూ, రాజకీయబాధితులకూ ఇవ్వడం ధర్మ"మని ఇంకోతట్టు కమ్యూనిస్టుల వాదన.

"మీరు తగువులాడుకోకండి. నే నన్నివిషయాలూ పరిశీలించి పైకి రిపోర్టు పంపుతా" నన్నాడు రాజశేఖరరావు.

౬

"హరనాథబాబ జై, కుసుమాకుమారి జై,
హరనాథబాబ జై, కుసుమాకుమారి జై,
హరనాథబాబ జై, కుసుమాకుమారి జై."

గోపాలపురంనుండి ఆరాత్రి ఎనిమిదిగంటలకు రాజశేఖరరావు ఇంటికి తిరిగి వచ్చేసరికి రాజేశ్వరి హరనాథబాబా, కుసుమకుమారీగార్ల పటాలు పెట్టి బ్రహ్మాండంగా నామసంకీర్తనం చేస్తోంది. బాబాభక్తులు ఆడామొగా ఏభయిమందిదాకా చేరారు. రాజేశ్వరి వీణ వాయిస్తోంది. చంద్రకళ తాళం వేస్తోంది.

"ఉదయం మీరు మకాం వెళ్ళినప్పటినుండీ బాబాకు ఏకాహం చేస్తున్నాం. ఈరాత్రి తెలవార్లూ బాబానామసంకీర్తనం జరుగుతుంది. మీరు కూడా రండి—పాడండి..."

"................."

"బాబా ప్రత్యక్షదైవం. నాకు ఎన్నోసార్లు కనిపిస్తూనేఉంటారు. చేతిలో పిల్లనగ్రోవి, తలలో నెమలిపింఛం, కాళ్లకు గజ్జెలు, మొలకి పట్టుపీతాంబరం. అడుగో నా హరగోపాలుడు. చూడండి, చూడండి."

రాజశేఖరరావు కేమీ కనిపించడంలేదు.

"రోజూ రాత్రిపూట బాబాకు వెండిగ్లాసులో పాలుపోసి ఎదురుగా పెట్టుతున్నాను. తెల్లవారే సరికి పాలుతాగేసి వొట్టిగ్లాసు ఉంచుతాడు—నాతండ్రి..."

"...................."

"ప్రీతితో ఏమిపెట్టినా తింటాడు.. మొన్న అరటిపండు పెట్టవూ అని దీనంగా అడిగాడు. నాతండ్రికి ఆపండు అంటే ఎంత ఇష్టమో."

"...................."

"మిఠాయి పెట్టితే తింటాడు. లడ్డూ పెట్టితే తింటాడు. చక్కెరపొంగలి అంటే ఇష్టం. మైసూరుపాకు అంటే ఎంత ప్రీతో! క్షీరాన్నం ఉంటే నా బాబాకు భోజనమే అక్కరలేదు..."

"....................."

"నాతండ్రి ఎప్పుడూ ఇంట్లో తిరుగుతూనే ఉంటాడు. నాతో మాట్లాడుతూనే ఉంటాడు. అడిగాను. ఎన్నిసార్లో అడిగాను—నా రాజశేఖరుడికి జిల్లాకలెక్టరీ ఎప్పుడవుతుందని—"

రాజశేఖరరావుకి తన భార్యస్థితి ఏమీ అర్థం కావడంలేదు. ఆమెభక్తి ఇంత తీవ్రరూపం దాల్చినట్టుగాని, ఇంత తీవ్రతలోనూ ఆమె కాంక్షించేది తను కలెక్టరుకావలసిన ప్రమోషన్ అనిగాని అతనికి తెలియదు. ఈ ఏకాహం ఆమె తలపెట్టడం ప్రభువు తనకు కలెక్టరుపదవి చేకూర్చడానికా!

రాజేశ్వరితపస్సు ఫలించడమే లేదు. తన తండ్రి కొండలరావు ఎన్నేళ్లో జిల్లాకలెక్టరీ చేసి లక్షలు గడించి, రిటైరయి కూడా, ఉద్యోగమో ఉద్యోగమో అని అలమటించి, ఇప్పుడు కూచిబీహారులో దివాన్‌గిరీ చేస్తున్నాడు. తన సోదరులు నలుగురు—దిగ్దంతులు—గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు. కాని తన పెనిమిటి ఇంకా తహశీల్‌దారే!

ఎప్పుడూ గాంధీమహాత్ముడు, సత్యము, అహింస, డ్యూటీ, నిష్కామకర్మ, త్యాగం, భగవద్గీత—ఇదే ఆలాపన ఆయనగారికి. ఈఅల్లుని పిచ్చిసిద్ధాంతాలూ, పిచ్చితత్వాలూ చూచి, ప్రాణం విసిగి, ఉత్తరం వ్రాస్తే జవాబివ్వడంకూడా మానేశాడు తండ్రి. ఆమెకా సంసారంలో సుఖం కనిపించడం లేదు.

తన పెనిమిటిని ఉద్ధరించగల దైవ మా హరనాథబాబా ఒక్కడే! ఆయనను తీవ్రంగా ఉపాసిస్తోంది. ఏకాహాలు చేయిస్తోంది. ఆనందమేళోత్సవాలు చేయిస్తోంది. తన పెనిమిటి డిప్టీ కలెక్టరయినా అయితే, సప్తాహం చేయిస్తానని మ్రొక్కుకొంటోంది.

"మీరుకూడా బాబానామసంకీర్తనం చేయండీ: మీకు సహాయం చేస్తాడు—"

"సంకీర్తన చేయకపోయినా, బాబా నాకు ఎల్లవేళలా సహాయం చేస్తూనే ఉంటాడు—"

"అడగకుండా అన్నీ యిస్తున్నాడని, భగవంతునే మరచిపోదామంటారా?"

"మనం మరచిపోయినా ఆయన మనల్ని మరచిపోడు—"

"అందుకని ఆయన్ని ప్రార్థించవలసిన అవసరం లేదందురా? మీ గురువుగారు—మహాత్మాగాంధీ కూడా ప్రతిరోజూ ప్రార్థనసభలు జరుపుతూ ఉండేవాడుగా—"

"ఆయన ప్రార్థన తనకు కలెక్టరుపదవి ప్రసాదించమని కాదు."

"మీకు కలెక్టరుపదవి కావాలని నేను భగవంతుని కోరుకోవడంకూడా తప్పే ?"

"ముమ్మాటికీని. ఈ ప్రపంచంలో నీకు ఏది కావాలో నిర్ణయించుకోడానికి నీకు అర్హత లేదు. దేనిని ప్రసాదిస్తే నీకు మేలు కలుగుతుందో దానినే, నీవు అడగకుండానే ప్రసాదిస్తూఉంటాడు పరమేశ్వరుడు..."

"....................."

"నీ పెనిమిటి కలెక్టరు కాదు, గవర్నరు కాదు; మహాసామ్రాజ్యానికి చక్రవర్తిత్వం పొందడానికి అర్హుడుగా ఉండవచ్చు. కాని ఆ పదవులు పొందినందువల్ల అతనికి కీడేగాని, మేలు కలుగదేమో ! అందువల్లనే నీపెనిమిటికి కలెక్టరుపదవి ప్రసాదించడంలేదు—నీ హరనాథబాబా !..."

"అయితే ఇక భగవంతుని ప్రార్థించడం దేనికి?"

"ప్రార్థించడం దేనికో నీకు తెలియకపోతే, ప్రార్థన మానివేయడమే మంచిది. నీవు ప్రార్థించినా, దూషించినా ఆయనకు సమానమే."

"మీ గాంధీగారు ప్రార్థన జరపకుండా బ్రతకలేదే ?"

"ఆయనకు ప్రార్థన అంటే ఏమిటో తెలుసును గనుక ప్రార్థనవినా ఆయన జీవించలేదు—"

"భగవంతుడు అన్నీ మనకు అయాచితంగానే యిచ్చేటట్లయితే ఇక మీరు తహశీల్దారీ చేయడం దేనికి—రాజీనామా ఇచ్చి యింట్లో కూర్చోండి..."

"నేను రాజీనామా ఇవ్వడం బాబా సంకల్పం కాదుకాబట్టే ఆపని చేయలేకుండాఉన్నాను—అర్థమయిందా ?..."

"అయితే కలెక్టరీ కావడం మీకు ఇష్టమా, అయిష్టమా ?..."

"అయిష్టమని నేను నీతో చెప్పానా ?..."

"అయితే కలెక్టరు కావడానికి మీ రేమి కృషి చేస్తున్నట్లు చెప్పండీ !"

"చాలా పొరబడుతున్నావు. నేను చేసే ప్రతీ కార్యమూ భగవంతుని పేరుతో చేస్తున్నాను. నాకృషి ఫలితంగా నాకు కలెక్టరీఅయినా సంతోషమే, లేక ఒక కూలీగా వెనక్కు తిరిగివెళ్లినా నాకు సంతోషమే !"

"....................."

"నీడ్యూటీ ఏమిటో తెలుసుకొని దానిని చెయ్యి. లేక మరణించు—అని చెప్పారు మహాత్ములు. నీ డ్యూటీని కాపాడుకోవడమే నీవంతు, ఫలితాన్ని ఫలితమే కాపాడుకొంటుంది అని చెప్పారు. ఏ మహాతత్త్వవేత్త ఇట్టి అమృతోపమానమైన సత్యం బోధించాడు ?"

అని గాంధీమహాత్ముని పటం చూచి మోకరిల్లి మొక్కాడు రాజశేఖరరావు.

'టెలిగ్రాం' అని వాకిట్లో కేక వినబడింది.

రాజశేఖరరావు టెలిగ్రాం విప్పి,

"*Father, start immediately—Babu.*" అని చదివాడు.

రాజేశ్వరికి కాళ్ళల్లో దడ పుట్టింది.

"మద్రాసులో కాలేజీలు తెరచినట్టేనా ?"

"తెరచిఉంటా రనుకొంటాను. సీటు దొరకడంతోటే జాబు వ్రాస్తాను, పైకం పంపం"డని మొన్ననేగా ఉత్తరం వ్రాశాడు.

రాత్రి మెయిలుకే నేను వెళ్తున్నానని రాజశేఖరరావు అంటే, నేనూ వస్తాను పదండని రాజేశ్వరి బయల్దేరింది.

౧౦

"అన్ని కాలేజీలకూ అప్లికేషన్లు పంపాను నాన్నగారూ ?"

"ప్రెసిడెన్సీ కాలేజికి అప్లయిచేశావా ?"

"ఆ !"

"లయోలా కాలేజికి ?"

"ఆ !......"

"క్రిస్టియన్ ?......"

"దానికీని."

"పచ్చయప్పా ?"

"ఆ! అన్ని కాలేజీలనుండి రిగ్రెటు కార్డులు వచ్చేశాయి."

"ఇదేమి విడ్డూరంరా బాబూ ?"

"ఏమి చేయుమంటావు అమ్మా? ఒక్కొక్క కాలేజీకీ వేలకొద్ది అప్లికేషన్లు వస్తుంటే వాండ్లు మాత్రం ఏమి చేయగలరు ?"

"..............."

"ప్రెసిడెన్సీ కాలేజీ గవర్నమెంటు కాలేజీ దానిలో కులాన్నిబట్టి సీటిస్తారు."

"అంటే ?—"

"పన్నెండు సీట్లలో రెండు బ్రాహ్మలకీ, రెండు మహమ్మదీయులకీ, రెండు క్రిస్టియన్లకీ మిగిలినవి బ్రాహ్మణేతరులకీనట !......"

"..............."

"కులభేదాలనుబట్టి లెఖ్ఖవేస్తే ప్రెసిడెన్సీ కాలేజీలో ముప్ఫయిమంది బ్రాహ్మలకంటె ఎక్కువ సీట్లు దొరకవు. ముప్ఫయిసీట్లకీ మూడువేల బ్రాహ్మలు తిరుగుతున్నారు !"

"...................."

"ప్రిన్సిపాలును చూచివస్తే 'నీకు మార్కులు చాల' వన్నాడు."

"ఆ !......"

"బ్రాహ్మలకయితే నాలుగువందలమార్కులు రావాలట ! ఇతరకులాలవాళ్లకయితే మూడువందలు చాలునట ! నాకు మూడువందలతొంభైతొమ్మిది మార్కులు వచ్చాయి. ఒక్కమార్కు తగ్గింది."

"అందుకని సీటు లేదంటాడా ?"

"అదొక సాకు. నాకంటే తక్కువమార్కులు వచ్చిన చాలామంది బ్రాహ్మలకి సీట్లిచ్చాడు—"

"ఎందువల్ల ?......"

"సిఫార్సులు ! ఒక్కొక్క అప్లికేషన్‌తో ఒక్క డజను సిఫార్సు లెటర్లు......"

"అయ్యో !—"

"ఈ నెల్లాళ్లూ కాలేజీలవెంట తిరగలేక కాళ్లు పడిపోయినవి."

రాజేశ్వరి పెద్దగా ఏడిచి బాబూను కౌగలించుకొంది.

"నేను ప్రిన్సిపాలును విడిచిపెట్టలేదు. నాతో వాదించలేక ఆఫీసుగదిలోనుండి జవాన్‌చేత నన్ను బయటికి నెట్టించాడు."

"నాతండ్రీ!" అని బాబూని అక్కున చేర్చుకొంది తల్లి.

"ఏమి చేయుమంటారు నాన్నగారూ ?..."

"................."

"చివరకి చదువుకూడా కరువైపోయిందటరా ఈ పాడుదేశంలో" అని ఏడిచింది రాజేశ్వరి.

"ఎందుకట్లా ఆయాసపడుతావు ?"

"నాకడుపు మండిపోతోంది. మీ రేమన్నా అనండి. చదువుకుంటా నని పసిపిల్లలు వస్తే చదువుకోడానికి వీల్లేదని నెట్టిపారేసే ఈ దేశంలో ఉండి యేమి, చచ్చి ఏమి ?"

"చావగలిగితే చచ్చిపో. ఎవరికి కనికరం?..."

"అంతేనా ! ఇదేనా మీరు చెప్పే సలహా !..."

"చచ్చిపోతా నని ఎవరిని బెదిరిస్తావు ? చావకుండా బ్రతకడం తెలుసుకొన్నవాడే బ్రతుకుతాడీ ప్రపంచంలో. బ్రతకడం చేతగానివాళ్ళు చావడమే మంచిది—".

"................."

"నీకొడుక్కు డిగ్రీలు లేకపోతే లోకానికి కొరతపడిపోతుం దనుకొన్నావా ?......"

రాజేశ్వరికి దుఃఖం ఆగడంలేదు.

"నాకొడుక్కు వీళ్లు చెప్పే చదువే అక్కరలేదు లెండి. వాండ్లు సీటిచ్చినా వీడు తీసుకోడు...నువ్వు ఇట్లాంటి కాలేజీలలో అడుగుకూడా పెట్టవద్దులే నాన్నా !"

"బెదిరించకు..."

"ఈచదువు చదువుకోకపోతే నా కొడుకు బ్రతకలేకపోడు. దేవుడిచ్చిన ఆయుర్దాయం ఉంటే వాడి రెక్కలమీద వాడు బ్రతకగలడు—"

"భేష్ ! ఆ మాటమీదనే నిలబడు—"

కోపం వచ్చి కొడుక్కు కాలేజీచదువు అక్కర లేదని రాజేశ్వరి అన్నదిగాని ఆ ఈడులో చదువు మానేసి ఆ కొడుకు ఏమిటి చేయడం ? ఆహా ! ఎంతటి వానికి ఎంత గతి పట్టింది! దివాన్‌బహదూర్ కొండల రావుగారి మనుమడికే సీటు లేదని తన్నిపారేస్తారుగా !

కూచిబీహారులో ఉన్న తండ్రికి టెలిగ్రాం యిద్దా మనుకొన్నది. కాదు—విమానం ఎక్కి వెళ్లి ఆయన్ని స్వయంగా పిలుచుకొనివద్దా మనుకొన్నది. యు. పి. లో ఉన్న అన్నగారిని పిలిపిద్దా మను కొన్నది. ఛీ! ఏముఖం పెట్టుకొని వాండ్లముఖం చూడడం ? నీపెనిమిటి ఇంకా తహశీల్‌దారేనా అని వాళ్లు అడిగితే తన శిరస్సు క్రింద పడిపోకుండా ఉంటుందా ?

ఆహా! కొడుకు స్కూలు ఫైనలు పాసయినా డని టెలిగ్రాం వస్తే ఎంత సంబరపడింది! ఎంత వేడుక చేసుకొంది !!

పిల్లవాడు ఒక్క మొగం వేసి కూర్చుంటే ఆమె చూడలేక—

"విచారపడకు నాన్నా. నీకు వచ్చిన భయం లేదు. అన్నిటికీ హరనాథబాబాయే ఉన్నాడు. నీకు తిండికీ, గుడ్డకీ కొరతచేస్తామురా నేనూ, నాన్న గారూను.—"

"నాకు తిండీ, గుడ్డా కాదమ్మా కావలసినది. చదువు కావాలి"

"మాట్లాడ రేమిటండీ? మీఅభిప్రాయ మేమిటి?"

"నే నేం చెప్పగలను ?..."

"మీ రొకసారి వెళ్లి ప్రిన్సిపాలుతో మాట్లాడి రండి......"

"ఏం మాట్లాడుమంటావు ?"

"ఇట్లా ఈ పిల్లవాడు దివాన్‌బహదూరు కొండల రావుగారి మనుమడు. తాతగారు జిల్లాకలెక్టరీ చేసి రిటైరయి ఇప్పుడు కూచి బీ హా రు లో దివాన్‌గా ఉన్నాడు. గొప్పయింటి బిడ్డ..."

"ఏమంత్రిదగ్గరనుండి అయినా సిఫార్సు ఉంటే గాని లాభం లేదమ్మా"

"ఏమిటి నీకీ వెర్రి రాజేశ్వరీ ? నన్ను వెళ్లి వాళ్ల కాళ్లు పట్టుకోమంటావా ?"

"ఈఒక్క పిల్లవాడికే మాత్రం సీటు ఇవ్వం డని అడిగితే తప్పా అండీ ?"

"నీ ఒక్క కొడుకుల్లాంటి కొడుకు లింకా ఎన్ని వేలు సీట్లు లేకుండా అల్లాడుతున్నారో చూశావా ?"

"అందుకని మీ రనే మాట ఏమిటి?..."

"నాకొడుక్కు ఆత్మగౌరవం ఉన్నది. నాకు ఆత్మగౌరవం ఉన్నది. కాలేజీలలో సీట్లు చాలకపోతే ఎన్నిలక్షలయినా ఖర్చుపెట్టి కొత్తకాలేజీలు కట్టించాలి. ఆ పని చేతకాకపోతే ఈ కాలేజీవిధానాన్ని రద్దుపరచాలి. నాకొడుకు ధ్రువనక్షత్రంలా తన ఆత్మ గౌరవం నిలవబెట్టుకొంటే చాలు. ఈ చదువు వాడికి అక్కరనేలేదు."

రాజేశ్వరి ఇంతకుముందు తన కొడుక్కు చదువు అక్కరలేదని అన్నా, అది ఆమె కోపంమీద

అన్నమాటలు. ఇప్పుడు పెనిమిటికూడా ఆ మాటలే అనేసరికి ఆమెకు కష్టంతోచి—

"సరే, మీ మతమే మీది. ఇక వాడికి చదువేమి అబ్బుతుంది ?"

"అబ్బకపోతే వచ్చిన నష్ట మేమీ లేదులే..."

"ఇక ఎందుకయినా పనికివస్తాడా.కుఱ్ఱవాడు?"

"పనికిరావడం అంటే నీఉద్దేశ్య మేమిటి?..."

"మీరు చదువుకొని పనికివచ్చారా, లేక పనికి రాకుండా పోయారా ?"

"నాలా తహశీల్ దారీ చేస్తే పనికివచ్చినట్టూ, చేయకపోతే పనికిరానట్టూనా ?"

ఆమెకు రవరవలాడి—

"మీకొడుకు ఉద్యోగం చేయనక్కరలేదు. కాని వాడి చేతికి చీపురుకట్ట యిచ్చి వీథులు చిమ్మించండి—సరిపోతుంది—"

"కోపం తెచ్చుకోవద్దు రాజేశ్వరీ! వీథులు చిమ్మేవాండ్లు పనికిరానివాళ్లేనా నీదృష్టిలో......"

"అందుకనే మీకొడుకుని పాకీవాణ్ణి చేయండి."

"పాకీవాణ్ణి చేయడానికీ, చక్రవర్తిని చేయడానికీ నేనెవరిని ? నీ వెవతెవు? పొట్టపోసుకొని ఈ దేహం కాపాడుకోడానికి ప్రతీవాడూ ఏదో పని చేయకతప్ప దని ఒప్పుకొంటావా ?"

"నిజమేనండీ! జన్మ ఎత్తినతర్వాత డబ్బు సంపాదించాలనీ, సుఖపడాలనీ ఉండనక్కరలేదండీ—మనిషికి?..."

"డబ్బు సంపాదించడమే నీకొడుకుజీవితానికి పరమావధి అయితే, నీకొడుకు ఐ. సి. యస్. అయినా దరిద్రుడుగానే ఉండవచ్చు. పట్నంలో క్షౌరపు షాపులు పెట్టుకొని ఎంతమంది వేలు గడించడంలేదు?"

"..................."

"బాబూ! విచారపడకు. నీవు పసివాడివి. జీవితం అర్థంచేసుకొని దిద్దుకోవడం చాలా కష్టం. మహాత్ముడుకూడా తాను ఈజీవితంలో చేసేది, సత్యంతో చేసే కొన్ని సాధన లని చెప్పారు. ఈసాధనలో తాను కూలిపోతానో, లేక పైకి వస్తానో చెప్పలేనని అన్నాడు. కూలిపోయినా, పైకి లేచినా నిన్నూ, నన్నూ, ప్రతీజీవరాశినీ కాపాడేది సత్యం, అహింసాను. ఈరెండూ నీవు ఆదర్శంగా పెట్టుకొని, నీవు ఈజన్మలో ఏపని చేసినా నీవు మహాతత్త్వవేత్త వవుతావు. సత్యాహింసలకు దూరమైననాడు నీవు పది యూనివర్సిటీడిగ్రీలు సంపాదించినా నిష్ప్రయోజనం."

"ఏమిటీ ఉపన్యాసం? చాల్లెండి. మీకొడుక్కు ఇప్పుడే బుఱ్ఱ గొరిగించి సన్యాసం ఇప్పించేటట్టు ఉన్నారే!..."

అని బాబూను లోపలికి తీసుకొనిపోయి, ఇంత కాఫీ యిచ్చింది రాజేశ్వరి. ఇంతలో 'టెలిగ్రాం' అని వాకిట్లో కేక.

"*Collector arriving. Return immediately.* —*Sheristadar.*"

"కలెక్టరు కొత్తపట్నం వస్తున్నాడట : నే వెళ్లాలి—"

"అబ్బాయిచదువు?......"

"దైవమే ఉన్నాడు—"

ఆరాత్రికే తిరిగి కొత్తపట్నం వచ్చాడు రాజశేఖరరావు. పిల్లవాడి సీటుకోసరం తాను స్వయంగా ప్రయత్నం చేస్తానని పట్నంలోనే నిలిచిపోయింది రాజేశ్వరి.

౨౧

రాజశేఖరరావు కొత్తపట్నం వచ్చేసరికి అట్టుడికిపోతోంది తాలూకా యావత్తూను.

నాలుగుసెక్షనుల రిజర్వుపోలీసులినీ, సూపరింటెండెంటునీ తీసుకొని దిగిపోయాడు కలెక్టరు.

"తహశీల్ దార్! నీ తాలూకాలో చాలా అలజడిగా ఉన్నది. రైతులవద్దనుండి నీవు ధాన్యం సేకరించలేకపోతున్నావు. గోపాలపురంలో హరిజనులూ,

రైతులూ తలకాయలు పగలగొట్టుకోడానికి తయారయిపోయారు. అదీగాక సర్కారు ఖజానాలో పదివేల రూపాయలు అపహరించి నీవు మద్రాసుకు నీపిల్లవాడి చదువునిమిత్తం తీసుకొనిపోయినట్టు నీమీద అర్జీలు. ఏమి చెప్పుతావు?..." అని సంజాయిషీ అడిగాడు కలెక్టరు.

"పదివేల రూపాయలా?"

"అవును."

"నేనా?..."

"అవును—"

"అపహరించానా?..."

"అవును. ఇదిగో అర్జీ..."

"సరే, మనవిచేస్తాను. ఈ రిజర్వుపోలీసులూ, తుపాకులూ దేనికండీ?..."

"నేను స్వయంగా రైతులవద్ద ధాన్యసేకరణ చేయడానికి వచ్చాను. అవసరమైతే అగ్నివర్షం కురిపిస్తాను."

"అగ్నివర్షం కురిపించవలసిన అవసరం లేదే! మీరు ఇల్లు కదలకుండా కూర్చోండి. ధాన్యసేకరణ నేనే చేసిపెట్టుతాను. నేను తాలూకా సేవకుడుగా ఉండగా మీ కెందుకీ కష్టం?..."

అని ఆక్షణంలగాయతు తన తాలూకా రైతులు పండించిన ధాన్యంలో తమ ఖర్చులు పోను అదనంగా మిగిలిఉన్న ధాన్యం ఒక వెయ్యిపుట్లు, తమంతట తామే బండ్లుకట్టి తీసికొనివచ్చి తాలూకాకచ్చేరీవద్ద కలెక్టరు సన్నిధిలో బట్వాడా చేసి, పైకం తీసుకొనిపోవలసినదనీ, ఆ ప్రకారం బట్వాడాచేసే పర్యంతమూ తాను నిరశనవ్రతము అవలంబిస్తున్నాననీ ప్రకటించి సత్యాగ్రహం ఆరంభంచేశాడు రాజశేఖరరావు.

కలెక్టరు చకితుడై—

"ఖజానాలో లోటుపడ్డ పదివేలరూపాయలూ ఏమిచేశా"వని గద్దించాడు.

"పోలీసులను పంపి దర్యాప్తు చేయించండి. ఆ పాప మేమిటో నే నెరుగను." అన్నాడు రాజశేఖరరావు.

"సర్కారుపైకం ఆచోకీ తెలిసేవరకూ నిన్ను అరెస్టులో ఉంచుతున్నా" నని కలెక్టరు అతగాడికి పోలీసుకాబ్దారీ పెట్టాడు.

తహశీల్దారు సత్యాగ్రహం చేస్తున్నాడని తాలూకాలో ప్రాకిపోయింది. రైతుఅయినవా డెవ్వడికీ నోటికి అన్నం పోవడం లేదు. రైతుసంఘంలో సంచలనం బయలుదేరింది. కాంగ్రెస్సులోని రెండు పార్టీలూ ఏకమైపోయినవి. కమ్యూనిస్టులు కాంగ్రెస్సులో చేరిపోయారు. కూలీలు రైతులతో ఏకమైపోయారు.

ఎక్కడ పుట్టిందో ఆ ప్రవాహం! రైతులు స్వంతబండ్లు కట్టించి, తమవద్ద అదనంగా మిగిలిన ధాన్యం కలెక్టరువద్ద అప్పగించి పైకం తీసుకొనిపోతున్నారు.

రాజశేఖరరావు ప్రాయోపవేశం ఆరంభించి, అయిదో రోజు...ఆరో రోజు. తిరునాళ్లకు వచ్చినట్లు వస్తున్నారు బండ్లలో జనమూ, ధాన్యమూను.

ఏడురోజులు పూర్తిఅయింది. మంచినీళ్లుతప్ప మరేమీ ముట్టుకోవడం లేదు రాజశేఖరరావు.

రెండువేలపుట్లు ధాన్యం చేరిపోయి, నిలవఉంచడానికి స్థలం దొరకడంలేదు.

మద్రాసునుండి రాజేశ్వరీ, బాబూరావూ గుండెలు బాదుకుంటూ పరుగెత్తారు.

రాజశేఖరరావు గాంధీమహాత్ముని పటందగ్గర కూర్చుని భగవద్గీతలో—

"యత్కరోషి యదశ్నాసి
యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ
తత్కురుష్వ మదర్పణమ్."

అని చదువుతున్నాడు.

కలెక్టరూ, సూపరింటెండెంటూ చకితులై "నీ తపస్సు చాలించు" అని ప్రార్థించారు.

రిజర్వుపోలీసులు తుపాకులు క్రింద పెట్టి రాజశేఖరరావుఎదుట మోకరిల్లారు.

మోసంతో తీసుకొన్న దొంగరేషన్ కార్డులన్నీ తీసుకొని వచ్చి రాజశేఖరరావుఎదుట దాఖలుచేస్తున్నారు జనం. రేషన్ షాపుల్లో ఉపయోగించే పిచ్చ శేర్లూ, పిచ్చకొలపాత్రలూ తెచ్చి హాజరుపెట్టి లెంపలువాయించుకొంటున్నారు సేల్సుమెన్.

గోపాలపురంలో రైతులూ, హరిజనులూ రాజీపడి, హరిజను లాక్రమించుకొన్న భూములు వారికే పట్టాలిచ్చేటట్లూ, పెద్దరైతులు తమ తమ స్వంతపట్టా భూముల్లో తలా పదెకరాలవంతున మిలిటరీవాండ్లకూ, దేశసేవకులకూ పంచియిచ్చేనిమిత్తం విడుదలచేస్తున్నామని కలెక్టరుదగ్గర అర్జీలు దాఖలుచేస్తే, ఆ భూముల క్రయం సర్కారువారు చెల్లించి బీదలకు పంచిపెట్ట డానికి ప్రయత్నంచేసింది ప్రభుత్వం.

రాజశేఖరరావు చేసిన మహాత్యాగానికి సంతసించి, ప్రధానమంత్రి స్వయంగా వచ్చి అతని నాశీర్వదించి జిల్లాకలెక్టరుగా ప్రమోషన్ చేశాడు.

ప్రధానమంత్రే బాబూరావుకు లయోలా కాలేజీలో సీటు ఇప్పించి దీవించి పంపించారు.

సర్కారుఖజానాలో పోయిన పదివేలరూపాయల విషయమై పోలీసులు విచారణ చేయగా, గోపాలపురంలో తను కోరుకున్న ఏభయ్యెకరాల భూమివిషయమై రాజశేఖరరావు అనుకూలంగా వ్రాసి సహాయం చేయలేదని మధుసూదనరావు కుట్రపన్ని తాలూకాఫీసుషరాబును—ఒక మహమ్మదీయుని—లోబరచుకొని రాజశేఖరరావు మద్రాసు వెళ్లిఉండిన సమయంలో పదివేలరూపాయల నోట్ల కట్టని అపహరించి, రాజశేఖరరావుమీద ఈ నేర మారోపించి, కలెక్టరుకు ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాసి పిలిపించినట్లు విచారణలో తేలింది. ఆ పదివేలరూపాయలూ మధుసూదనరావువద్ద వసూలుచేయవలసినట్లు గవర్నమెంటు ఉత్తర్వు అయింది.

మధుసూదనరావుకొరకు ఇంటిదగ్గిర విచారించగా ఇండియాగవర్నమెంటులో ఉద్యోగప్రయత్నం నిమిత్తం ఢిల్లీ వెళ్లాడని అన్నారు.

మహాత్మునికి నమస్కరించి ఒక గ్లాసు ఆవుపాలు త్రాగాడు రాజేశ్వరరావు

"హరనాథబాబా జై, కుసుమకుమారి జై" అని పాడింది జిల్లాకలెక్టరు రాజశేఖరరావుభార్య రాజేశ్వరి.

